
ఆంధ్రజ్యోతి

****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శుక్రవారం 31 జనవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980


నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.131	210	240
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 , కనిష్ఠం 18.8



ఆరోగ్యమే మహాభాగ్యం

- ఆధ్యాత్మికతకూ ప్రాధాన్యం
- మలిదశలో సీనియర్ సిటిజన్ల అభిప్రాయం
- వయసుడిగినా తప్పని కుటుంబ బాధ్యతల్లో కొందరు
- సామాజిక సేవతో కొందరికి సంతృప్తి



జీవితమంతా ఏదో ఒక వృత్తిలో కొనసాగిన వారు ఆ బాధ్యతల నుంచి విరమణ పొందాక ఏదో వ్యాపకాన్ని కల్పించుకొని సంతృప్తి చెందుతున్నారు. ఓ వైపు ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటూ, మరోవైపు వారికిష్టమైన వ్యాపకంతో గడుపుతున్నారు. కొందరికి అనివార్యంగా ఇంకా కుటుంబ బాధ్యతలు నిర్వర్తించాల్సి రావడంతో కొందరు వృద్ధాప్యంలోనూ ఏదో ఒక వృత్తి నిర్వరిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. మరికొందరు విశ్రాంతి తీసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఇంకొందరు తీర్థ యాత్రలు, పర్యాటక ప్రాంతాలు సందర్శిస్తున్నారు. కొందరు సామాజిక సేవతో సంతృప్తి చెందుతున్నారు. సీనియర్ సిటిజన్లు వృత్తి విరమణ తర్వాత ఏం చేస్తున్నారనే అంశంపై 'ఆంధ్రజ్యోతి' సర్వే నిర్వహించగా, అత్యధికంగా ఆరోగ్యసంరక్షణ, ఆధ్యాత్మికానికి ప్రాధాన్యమివ్వగా, అత్యల్పంగా తీర్థయాత్రలకు వెళ్తామని అభిప్రాయం వ్యక్తం చేశారు.

● వివరాలు 7లో.. - (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

ఆరోగ్య సంరక్షణకు 30శాతం మంది ప్రాధాన్యం

ఉమ్మడి జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లోని సీనియర్ సిటిజన్ల వ్యాపకాలపై 'ఆంధ్రజ్యోతి' సర్వే నిర్వహించింది. మొత్తం 19 మునిసిపాలిటీల్లో 240 మందిని 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. పర్యాట కం, ఆధ్యాత్మికం, ఆరోగ్యం, సామాజికసేవ, ఉద్యోగం, కుటుంబ బాధ్యతలు అనే ఐదు అంశాల్లో వేటికి ప్రాధాన్యం ఇస్తారని ప్రశ్నించగా, వారు మనోగతాన్ని ఆవిష్కరించారు. ఈ సర్వేలో 73 మంది అంటే 30శాతం మంది ఆరోగ్యసంరక్షణకు ప్రాధాన్యమిచ్చారు. ఆతర్వాత 22 శాతం (53మంది) శేషజీవితాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వెచ్చిస్తున్నామని, భగవంతుడి సేవలో తరిస్తున్నామని పేర్కొన్నారు. మరో 18 శాతం (42మంది) అనివార్య పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో చిరుద్యోగాలు, కుటుంబ బాధ్యతలు నిర్వర్తించక తప్పడం లేదని తెలిపా రు. 17శాతం (41 మంది) మాత్రం సామాజిక, సంఘ సేవలు నిర్వహిస్తున్నారు. 13శాతం (31మంది) తీర్థయాత్రలు, పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తూ కాలక్షేపం చేస్తున్నామని తెలిపారు.

గాంధీ అందరికీ ఆదర్శప్రాయుడు

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి




గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

చిట్యాలరూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అహింసామార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన గాంధీజీ అందరికీ ఆదర్శప్రాయుడని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పెద్దకాపర్తి శివారులోని గాంధీ గుడిలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అహింసామార్గం భవిష్యత్ తరాలకు అందించాలంటే మళ్లీ గాంధీ పుట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం స్వార్థం కారణంగా వ్యవస్థలు, రాజకీయాలు భ్రష్టుపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిలర్‌గా పోటీ చేయాలన్నా లక్షలు వెచ్చించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించే వారికే పార్టీలు టికెట్‌లు ఇస్తే రాజకీయాలు కాస్తయినా మారుతాయన్నారు. జాతీయరహదారి వెంట గాంధీ గుడిని నిర్మించి భక్తులు దర్శించుకునే అవకాశాన్ని కల్పించిన ఆలయ ట్రస్టీ మోర శ్రీపాల్‌రెడ్డి, మోర భూపాల్‌రెడ్డి, పారుపల్లి వెంకటకృష్ణారావు, డాక్టర్ సీత అభినందనీయులన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ చీఫ్ ఇన్‌కంటాక్స్ అధికారులు పీవీ.రావు, వెంకటేశ్వర్లు, జగదీష్‌బాబు, శివార్చక విజయ్‌కుమార్, నాగసూరి వేణుగోపాల్, ఎస్‌కె.బాబూజీ, గోపాలగాంధీ, తదితరులు పాల్గొన్నారు.

వరి సాగు పెరిగింది





కాలం కలిసొచ్చి ప్రాజెక్టుల్లో రెండు పంటలకు సరిపడా సాగునీరు నిల్వ ఉంది. నీటి వనరులు సమృద్ధిగా లభించడంతో రైతులు యాసంగి పంటల సాగు పనులు శరవేగంగా పూర్తిచేశారు. యాసంగిలో వరి విస్తీర్ణం సాధారణ స్థాయికి మించింది. నీటి లభ్యత పెరిగిన నేపథ్యంలో ఉద్యాన పంటల సాగును రైతులు వదిలేస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో మెట్టపంటల సాగు కనీసం సాధారణానికి మించడం లేదు. మరోవైపు సాగునీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాల రైతులు వరి సాగుకు ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో ఏటా దీని విస్తీర్ణం పెరుగుతోంది. 2023-24 యాసంగిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,43,472 ఎకరాల్లో వరి సాగు కాగా, ప్రస్తుత యాసంగిలో 11,87,864 ఎకరాల్లో సాగైంది. గత సీజన్ కంటే 1,44,392 ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగింది. దీంతో నాగార్జునసాగర్, మూసీ ఆయకట్టు పచ్చని పైర్లతో ఆకుపచ్చరంగును అద్దుకొని ఆహ్లాదాన్ని పంచుతూ కోనసీమను తలపిస్తోంది.

- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ అర్బన్)

- కలిసొచ్చిన కాలం
- ప్రాజెక్టుల నీటికి తోడు ఉపకరించిన బోరుబావులు
- యాసంగిలో 11.87 లక్షల ఎకరాల్లో సాగు
- బోనస్ ప్రకటనతో సన్నాల సాగుకే రైతుల మొగ్గు

ప్రాజెక్టులు జల కళను సంతరించుకోవడం, సమృద్ధిగా కురిసిన వర్షాలతో భూగర్భజలాలు పెరగడంతో సాగునీటి కష్టాల నుంచి ఊరట దక్కింది. ఈ నేపథ్యంలో అన్నదాతలు గడిచిన వానాకాలం, ప్రస్తుత యాసంగిలో సమయానుకూలంగా సాగు పనులు పూర్తిచేశారు. నాగార్జునసాగర్, మూసీ ప్రాజెక్టుల నుంచి సాగునీటి విడుదల కొనసాగుతున్న క్రమంలో వరిసాగుకు రైతులు ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో ఉమ్మడి జిల్లాలో వరిసాగు సాధారణ విస్తీర్ణం కంటే 15శాతం పెరిగింది. ఉమ్మడి జిల్లాలో వరి సాధారణ విస్తీర్ణం 10,31,313 ఎకరాలుగా కాగా, ఈ సీజన్‌లో 1,56,551 అధికంగా సాగైంది. సాగునీటి వనరులన్నీ వినియోగంలో రావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జొన్న, శనగ, పొద్దుతిరుగుడు, కంది, ఉలువ, మినుప వంటి మెట్ట విస్తీర్ణం పడిపోగా, ఉద్యాన పంటలసాగులోనూ లోటు ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలో 11,251 హెక్టార్లలో యాసంగి మెట్టపంటలు సాగు కావాల్సి ఉండగా, ప్రస్తుతం 6,047 హెక్టార్లలో మాత్రమే మెట్టపంటలు సాగయ్యాయి. బత్తాయి, నిమ్మ, మామిడి, సపోట తదితర ఉద్యాన పంటల సాగు ఏటా గణనీయంగా తగ్గుతోంది. గతంలో 93,252 ఎకరాల్లో ఉద్యాన పంటలసాగు జరిగితే ప్రస్తుతం సాగు విస్తీర్ణం 54,431 ఎకరాలకు పరిమితమైందని వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి. రానున్న రోజుల్లో మెట్ట, ఉద్యాన పంటలసాగు మరింతగా తగ్గే ప్రమాదం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు కురగాయల సాగుకు రైతులు ఏ మాత్రం ఆసక్తి చూపడంలేదు. యాదాద్రి జిల్లాలో ఈ సీజన్‌లో 850 ఎకరాల్లో

- మిగతా 7వ పేజీలో

ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండటౌన్,జనవరి 30 (ఆంధ్రజ్యోతి):ప్రాజెక్టులు,స్థానిక పనులకు ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వంగమర్తి రీచ్‌లో ఇసుక తవ్వకాన్ని మరో ఆరు నెలలు పొడగిస్తున్నామన్నారు. ఇక్కడి నుంచి 3,66,613 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వేందుకు జిల్లా స్థాయి కమిటీ ఆమోదించిందన్నారు. అదేవిధంగా ఇక్కడి నుంచి సాగునీటి ప్రాజెక్టులైన ఉదయ సముద్రం, ఎస్ఎల్‌బీసీ,మునిసిపల్ పనులు, వైటీపీఎస్, కిష్టాపురం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులకు ఉపయోగించాలని తీర్మానించామన్నారు. మూసీ ఎగువన కొత్తగా గుర్తించిన ప్రాంతంలో 70,980క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకానికి కమిటీ అనుమతిస్తూ మూడు నెలల్లో మైనింగ్ అనుమతులకు ప్రణాళిక సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, శామ్యూల్ జాకబ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయం

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, డీటీసీ వాణి

నల్లగొండ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా నెల రోజుల పాటు రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. గురువారం జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ డాక్టర్ ఎన్.వాణితో కలిసి స్థానిక ఎన్జీ కళాశాలలో ప్రారంభించారు. ఎస్పీ స్వయంగా బైక్ నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అన్ని స్టేషన్ల పరిధిలో ప్రజలకు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. తనతో పాటు ప్రతీ డీఎస్పీ ఓ గ్రామాన్ని దత్తత తీసుకుని రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నామన్నారు. అంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, ట్రాఫిక్ సీఐ రాజు, వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ లావణ్య, ఎంవీఐలు కొండయ్య, మల్లిఖార్జున్, స్వప్న, సోనిప్రియ, ఏఎంవీఐలు భాస్కర్‌రెడ్డి, గోపీనాథ్, పాల్గొన్నారు.

పెద్దగట్టు జాతరకు నిధులు కేటాయించండి

సీఎంకు ఎంపీ రఘువీర్ వినతి



సీఎం రేవంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రఘువీర్

హాలియా, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిర్వహించే పెద్దగట్టు (గొల్లగట్టు) జాతరకు భారీగా నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో సీఎంను కలిసి వినతి పత్రం అందజేశారు. జాతరకు దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో భక్తులు వస్తారని, ఈ నేపథ్యంలో మౌలిక వసతులు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. గత ప్రభుత్వాల హయాంలో తాత్కాలిక ఏర్పాట్లు చేసి చే తులు దులుపుకున్నారని, ఈసారి శాశ్వత ప్రాతిపదిన పనులు చేయాలని కోరారు. దీంతో సీఎం స్పందించి నిధులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఎంపీ తెలిపారు. కాగా, సీఎం సానుకూలంగా స్పందించడంపై కాంగ్రెస్ యూత్ మాజీ అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్ హర్షం వ్యక్తం చేశారు.

షెడ్యూల్ రావడమే తరువాయి

పంచాయతీ ఎన్నికలకు అధికారుల ఏర్పాట్లు ముమ్మరం

ఇప్పటికే తుది ఓటర్ల జాబితా విడుదల

●6లో..

రైల్వేస్టేషన్లలో నగదు రహిత టికెట్ సేవలు

డీసీఎం కమలాకర్‌బాబు



నగదు రహిత టికెటింగ్‌పై ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న రైల్వే డీసీఎం కమలాకర్‌బాబు

మిర్యాలగూడ, మిర్యాలగూడ అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేస్టేషన్లలో నగదురహిత టికెట్ సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు గుంటూరు డివిజన్ కమర్షియల్ మేనేజర్ కమలాకర్‌బాబు తెలిపారు. గురువారం మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు నగదురహిత టికెట్ బుకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యూటీఎస్ మొబైల్ అప్లికేషన్ ద్వారా టికెట్లు బుక్‌చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా ప్రయాణికులు క్యూలైన్‌లో నిలబడకుండానే క్యూఆర్ కోడ్ ద్వారా టికెట్లు పొందే అవకాశం కల్పించామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని ఆన్‌లైన్ సేవలను దక్షిణమధ్య రైల్వేశాఖ అందుబాటులోకి తెస్తోందన్నారు. అనంతరం మొబైల్ టికెటింగ్ విధానంపై ప్రయాణికుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో నల్లగొండ సెక్షన్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సతీష్, మిర్యాలగూడ కమర్షియల్ సూపర్వైజర్ గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నూతన విభాగంపై మిశ్రమ స్పందన

రెవెన్యూ శాఖలో భూపరిపాలన ఆవిష్కరణలు, న్యాయ సహకారం పేరిట ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై మిశ్రమ స్పందన వస్తోంది. అత్యంత ముఖ్యమైన రెవెన్యూ శాఖపై ప్రభుత్వాలకు కొరవడుతున్న స్పష్టత, పారదర్శకతతో పట్టాదారులు ఇబ్బందులకు గురవుతుండగా కొద్దిమంది అధికారులు, దళారులకు లాభాలు చేకూరుతున్నాయని అంటున్నారు. నూతన విభాగాన్ని అయినా పకడ్బందీగా, శాశ్వత ప్రాతిపాదికన సమస్యలను పరిష్కరించేలా ఏర్పాటు చేయాలంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తాం



రెవెన్యూ శాఖలో ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన విభాగాన్ని స్వాగతిస్తాం. నూతన విభాగంతో కలిసి పనిచేస్తాం. కానీ పారదర్శకంగా ప్రభుత్వం పేర్కొంటున్న న్యాయ సహకార సెల్ పనిచేయాలని కోరుకుంటున్నాం. అలాగే జరిగే పొరపాట్లకు రెవెన్యూ ఉద్యోగులను బాధ్యులను చేయొద్దు. గ్రామరెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలని కోరుతున్నాం.

కే శ్రీకాంత్, అధ్యక్షుడు, జిల్లా రెవెన్యూ ఉద్యోగులు సంఘం, యాదాద్రి జిల్లా

బయటి వ్యక్తుల ప్రమేయంతో నిర్వీర్యం



1989లో అమల్లోకి తెచ్చిన ఆర్‌వోఆర్‌లో అప్పటి సీఎస్‌ఎస్ అయిన ఐఏఎస్ అధికారి ఆనంద్‌రావు రూపొందించిన నిబంధనలతో అప్పట్లో రెవెన్యూ వ్యవస్థ సమర్థంగా పనిచేసింది. కానీ కొంతకాలంగా ప్రభుత్వాలు బయటివ్యక్తులతో చేస్తున్న ప్రయోగాలతో శాఖ నిర్వీర్యమవుతోంది. గత ప్రభుత్వం రూపొందించిన ధరణి పోర్టల్‌లోనూ బయటివ్యక్తుల ప్రభావమే అధికంగా ఉంది. తిరిగి నేటిప్రభుత్వం కూడా నూతన విభాగాల పేరిట అదేతరహా పొరపాట్లను పునరావృత్తం చేస్తోంది. ప్రభుత్వ సంస్కరణలలో రెవెన్యూ శాఖలోని సమర్థులైన అధికారులు, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను భాగస్వాములను చేస్తే ప్రభుత్వానికి, పట్టాదారులకు మేలు జరుగుతుంది.

ఉదయ్‌కుమార్, విశ్రాంత తహసీల్దార్, భువనగిరి.

ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు



రెవెన్యూ శాఖపై రాష్ట్ర గత, తాజా ప్రభుత్వాలకు చిత్తశుద్ధి కొరవడింది. గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను ప్రవేశపెడితే కొన్ని సవరణలతో నేటి ప్రభుత్వం భూమాత పోర్టల్‌ను తెచ్చింది. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సేవలలో కీలకమైన వీఆర్‌వో వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేస్తే నేటి ప్రభుత్వం పునరుద్ధరిస్తామంటోంది. కానీ రెవెన్యూ శాఖకు చీడలా మారిన సమస్యల శాశ్వత పరిష్కారానికి చిత్తశుద్ధి కొరవడి స్వప్రయోజనాలకే పాలకులు ప్రాధాన్యమిస్తున్నట్లు అర్థమవుతోంది.

సాధినేని రవీందర్, రాష్ట్ర కార్యదర్శి భారతీయ కిసాన్ సంఘ్.

నిష్పక్షపాతంగా ఏర్పాటుచేయాలి



రెవెన్యూ శాఖ సమస్యల పరిష్కారం ప్రభుత్వం ప్రతిపాదించిన న్యాయ సహకార సెల్‌ను నిష్పక్షపాతంగా ఏర్పాటుచేయాలి. సెల్‌కు వచ్చే అప్లికేషన్‌లను గడువు లోపు వాస్తవాల ఆధారంగా పరిష్కరించాలి. సెల్ నిర్ణయాలపై ప్రభుత్వం, అధికారులు జోక్యం చేసుకోరాదు. అయితే సెల్ తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే సంబంధితులపై ప్రభుత్వం న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి. సెల్ సభ్యుల ఎంపికతోనే ప్రభుత్వం చిత్తశుద్ధి బహిర్గతమవుతుంది.

జీ లింగయ్య, న్యాయవాది, భువనగిరి.

షెడ్యూల్ రావడమే తరువాయి



నల్లగొండలోని గోదాములో సిద్ధంగా ఉన్న బ్యాలెట్‌పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు నల్లగొండ జిల్లా అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం అవసరమైన అన్నిఏర్పాట్లను చకచకా చేస్తున్నారు. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల కోసం తుదిఓటరు జాబితాను సిద్ధం చేసిన అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన ఏర్పాట్లను గడిచిన మూడు నాలుగు నెలలుగా చేపడుతోంది. బ్యాలెట్ పెట్టెలకు మరమ్మతులు చేసి గోదాంలో భద్రపరిచారు. తాజాగా బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తయి జిల్లాకు చేరుకున్న బ్యాలెట్ పత్రాల కౌంటింగ్, పరిశీలన ప్రక్రియ ను చేపట్టారు.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొడ టౌన్)

- పంచాయతీ ఎన్నికలకు ముమ్మరంగా ఏర్పాట్లు
- ఇప్పటికే తుదిఓటరు జాబితా సిద్ధం
- కొనసాగుతున్న బ్యాలెట్ పేపర్ల పరిశీలన

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లాలో ఇటీవల ఏర్పడిన నూతన మండలాలతో పాటు కొత్తగా ఏర్పాటుకానున్న వాటితో కలిపి 33 మండలాల్లోని 868 పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో జిల్లాలో 31 మండలాలు 844 గ్రామపంచాయతీలుండగా వాటి సంఖ్య ప్రస్తుతం పెరిగింది. ఈ మేరకు ఆ దిశగా అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది.ఇందులో భాగంగా ఇప్పటికే తుది ఓటరు జాబితాను సైతం సిద్ధం చేశారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 10 లక్షల 56 వేల ఓటర్లు ఉండగా జిల్లా వ్యాప్తంగా 7,392 పోలింగ్ బూత్‌లను గుర్తించారు. దీనికి తోడు పోలింగ్ సిబ్బంది వివరాలను సైతం సేకరించి పోలింగ్ కేంద్రాల వారీగా తయారుచేస్తున్నారు.

జిల్లాకు చేరిన ఎన్నికల సామగ్రి

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అవసరమైన ఎన్నికల సామగ్రి ఇప్పటికే జిల్లాకు చేరింది. బ్యాలెట్ పత్రాలు సైతం జిల్లాకు చేరుకోగా జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలోని గోదాముల్లో వీటిని భద్రపరిచారు. గ్రామ సర్పంచ్, వార్డు మెంబర్లు సంబంధించి రెండు వేర్వేరు రంగుల్లో వీటిని ముద్రించారు. సర్పంచ్ ఎన్నికలకు గులాబి రంగు బ్యాలెట్‌ను, వార్డు మెంబర్‌కు తెలుపురంగులో ముద్రించి బ్యాలెట్‌ను ముద్రించారు. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ఈసారి సర్పంచ్ అభ్యర్థులకు 30 రకాల గుర్తులను, వార్డు మెంబర్లకు 20 రకాల గుర్తులను సిద్ధం చేశారు. సర్పంచ్‌లుగా పోటీ చేసేవారికి ఉంగరం, కత్తెర, ఫుట్‌బాల్, బ్యాట్, బాట్‌మెన్, స్టంప్స్ టీవీ రిమోట్, టూత్‌పేస్ట్ వంటివి ఉన్నాయి. వార్డు సభ్యులకు పొయ్యి, స్టూల్, బీరువా, గ్యాస్ సిలెండర్, గౌను, ఈల, కుండ వంటి గుర్తులను కేటాయించనున్నారు. మొత్తం 25 లక్షలకు పైగా బ్యాలెట్ పత్రాలు జిల్లాకు చేరుకోగా వాటిల్లో గుర్తులు, బండిల్స్ లెక్కించే పనిలో జిల్లా పంచాయతీ అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం

జిల్లాలో ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలతో పోలింగ్ కేంద్రాలను పరిశీలించాం. బ్యాలెట్ పెట్టెలకు మరమ్మతులు చేశాం. సర్పంచ్, వార్డు సభ్యులకు అవసరమైన బ్యాలెట్ పేపర్లు ముద్రించడమే కాకుండా వాటిని పరిశీలించే కార్యక్రమం కొనసాగుతోంది.

-వెంకయ్య, నల్లగొండ జిల్లా పంచాయతీ అధికారి

గోదాముల్లో బ్యాలెట్ బాక్సులు నిక్షిప్తం

పంచాయతీ పోరుకు సంబంధించి అవసరమైన బ్యాలెట్ బాక్సులు ఇప్పటికే జిల్లాకు చేరాయి. ఇటీవల రైల్వే డిపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన డివిజన్ ఎన్నికల్లో వినియోగించిన బ్యాలెట్ బాక్సులను ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం వివిధ డివిజన్ల నుంచి జిల్లాకు తెప్పించి నోడల్ అధికారుల సమక్షంలో చిన్నచిన్న మరమ్మతులుంటే సరిచేసి కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాంలలో భద్రపరిచారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల్లో వసతులపై కూడా ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. అధికారులు శాసనసభ, లోక్‌సభ ఎన్నికలకు వినియోగించిన పోలింగ్ కేంద్రాల్లోనే తాగునీరు, ప్రహరీ, విద్యుత్, ఫ్యాన్లు, ర్యాంపులు ఇతర మౌలిక వసతులు తనిఖీ చేస్తూనే సమస్యలు తెలుసుకుంటున్నారు.

ఎన్నికల కోడ్ కూసింది

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అమల్లోకి ప్రవర్తనా నియమావళి
- విగ్రహాలకు ముసుగులు వేస్తున్న సిబ్బంది

నల్లగొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ - ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల కావడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రవర్తనా నియమావళి అమల్లోకివచ్చింది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ రానుండగా 10వ తేదీ వరకు నామినేషన్ వేసేందుకు అవకాశం ఉంది. 11న నామినేషన్లను పరిశీలిస్తారు. 13వ తేదీన ఉపసంహరణకు అవకాశం కల్పించనున్నారు. పోలింగ్ ఫిబ్రవరి 27న జరగనుండగా ఓట్ల లెక్కింపు మార్చి 3న నిర్వహిస్తారు. మార్చి 4వ తేదీ తరువాతే ఎన్నికల కోడ్ ముగియనుంది. ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ పదవీకాలం ఈ ఏడాది మార్చి 29తో ముగియనుంది. ఎన్నికల కోడ్ రావడంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రవర్తన నియమావళిని అమలులోకి తీసుకవచ్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు కూడళ్లలో మహనీయుల విగ్రహాలతో పాటు రాజకీయ నాయకుల విగ్రహాలకు మునిసిపల్ సిబ్బందితో పాటు పంచాయతీ సిబ్బంది ముసుగులు వేస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడి కోడ్ ముగిసిన తర్వాతే ముసుగులు తీస్తారు. కోడ్ అమల్లోకి రావడంతో కొత్త పథకాలకు శంకుస్థాపనతో పాటు ప్రారంభోత్సవాలన్నీ నిలిచిపోయాయి. నెల రోజులకు పైగా ఎన్నికల కోడ్ అమలులో ఉండనుంది. అయితే ఇప్పటికే అమలుచేసిన సంక్షేమ పథకాలు కొనసాగుతాయా లేదా నిలిపివేస్తారా అనే దానిపై జోరుగా చర్చ సాగుతోంది. ఈ నెల 26న రైతుభరోసాతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల జారీ ప్రక్రియకు ఆటంకం కలుగనుంది. అయితే రన్నింగ్‌లో ఉన్న పథకాలకు ఎలాంటి ఇబ్బందిలేదని గతంలో పలుమార్లు అధికారులు, అప్పటి ప్రభుత్వాలు పేర్కొన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం కూడా అలా ఉంటుందా లేక పూర్తిగా నిలిచిపోయతా అనేది స్పష్టత రావాల్సి ఉంది. ముఖ్యంగా రైతుభరోసా వంటి పథకం అందకపోతే రైతులు తీవ్ర ఆర్థికఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే కేవలం పైలెట్ ప్రాజెక్టు కింద ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 73 మండలాల్లో 73 గ్రామాల్లో మాత్రమే ఈ నాలుగు పథకాలను లాంచనంగా అమలుచేశారు. మిగతా గ్రామాల్లో, పట్టణాలల్లో, వార్డుల్లో పథకాల అమలుపై ప్రతిష్ఠంబన ఏర్పడింది. ముఖ్యంగా రైతుభరోసా నిధుల కోసం రైతులు ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.



సూర్యాపేటలో ఓ నాయకుడి విగ్రహానికి ముసుగు వేసిన మునిసిపల్ సిబ్బంది

అంత్యక్రియలకు అండగా నిలిచారు

ఆత్మకూరు(ఎం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాల కిందటే వలస వెళ్లినా..అంత్యక్రియలకు సొంత ఊరు అండగా నిలిచింది. ఇల్లు లేని ఓ నిరుపేదకు తన పూర్వీకుల ఇంటిముందు టెంట్ వేసి అంతిమసంస్కారానికి అండగా ఉంది. గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలకేంద్రంలో ఈ ఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రానికి చెందిన కొంగరి మల్లయ్య(62)కు ముగ్గురు అన్నదమ్ములు. మల్లయ్య రెండోవాడు. కాగా చిన్నతమ్ముడు శ్రీశైలంతో కలిసి 40ఏళ్ల కిందట బతుకుదెరువు కోసం ఖమ్మం వలసవెళ్లాడు. అక్కడే ఉంటూ హమాలీగా పనిచేస్తూ భార్య, ఇద్దరు కుమార్తెలను పోషించుకుంటూ జీవనం సాగించాడు. అయితే మల్లయ్య స్వగ్రామానికి వచ్చిపోతుండేవాడు. కొంతకాలంగా మల్లయ్య కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ బుధవారం రాత్రి ఖమ్మంలో మృతి చెందాడు. ఖమ్మంలో ఇల్లు లేకపోవడం, బంధువులు ఎవరూ లేకపోవడంతో పుట్టిన ఊరిలోనే దహన సంస్కారాలు చేసేందుకు మల్లయ్య మృతదేహాన్ని గురువారం ఆత్మకూరు(ఎం)కు తరలించారు. అయితే గ్రామంలో తల్లిదండ్రులకు సంబంధించిన కొద్దిపాటి భూమి ఉండటంతో అక్కడే టెంట్ వేసి మృతదేహాన్ని ఉంచారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. మల్లయ్య కుటుంబ దీనస్థితి గ్రామస్థులను కంటతడిపెట్టించింది. ప్రస్తుతం మండల కేంద్రంలోని కురుమ సంఘం భవనంలో వారికి ఆశ్రయం కల్పించారు. బీఆర్ఎస్ తరపున ఆ పార్టీ మండల అధ్యక్షుడు బీ చందర్, మాజీ ఎంపీటీసీ వై కవిత చెరో రూ.5000, గొర్లకాపర్ల సంఘం మండల అధ్యక్షుడు కోరె భిక్షపతి రూ.4000 ఆర్థిక సహాయాన్ని మల్లయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు.



ఆత్మకూరు(ఎం)లో టెంట్ కింద మల్లయ్య మృతదేహం

‘స్త్రీనిధి’ గోల్‌మాల్

- ● సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో ఘటన
- ● రూ.30లక్షలు స్వాహా చేశారంటూ ఆరోపణలు

మఠంపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా సున్నా వడ్డీకి సమభావన సంఘాలకు రుణాలు మంజూరు చేస్తోంది. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన వీఓఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్) రూ.30లక్షలు సొంత అవసరాలకు వాడుకుందని సమభావన సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధిత మహిళలు గురువారం వెల్లడించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. చౌటపల్లి గ్రామంలో 36సమభావన సంఘాలు ఉన్నాయి. వీటిలో 23 సంఘాలకు వీవోఏ నాగమణి రెండేళ్ల క్రితం వడ్డీ లేని పథకం ద్వారా బ్యాంకు నుంచి రూ.1.50కోట్ల రుణాలను మండల స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ శైలజ ద్వారా ఇప్పించింది. రుణాలు తీసుకున్న సభ్యులు ప్రతి నెలా వీవోఏ ద్వారా బ్యాంకుకు నగదు చెల్లిస్తున్నారు. సంఘం సభ్యుల నుంచి తీసుకున్న నగదును వీవోఏ నాగమణి ఏడాదిగా బ్యాంకులో కొంతే జమచేసి, ఎక్కువ మొత్తాన్ని సొంత అవసరాలకు వాడుకుంది. ఇటీవల పలువురు సంఘాల సభ్యులు బ్యాంకు సిబ్బందిని సంప్రదించి, తాము వీవోఏకి చెల్లించిన నగదు పూర్తి స్థాయిలో రుణ ఖాతాల్లో జమకావడంలేదని తెలుసుకున్నారు. దీంతో ఆగ్రహంతో ఉన్న సంఘాలు లీడర్లు, సభ్యులు ఈ తతంగంపై వీవోఏ నాగమణిని నిలదీశారు. సుమారు రూ.30లక్షలను వీవోఏ దారి మళ్లించి తన సొంత ఖర్చులకు వాడుకుందని సమభావన సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై రెండు రోజుల క్రితం వీవోఏ ఇంటికి వెళ్లి బహిరంగంగా నిలదీశారు. గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. పెద్దల సమక్షంలో శుక్రవారం మరోసారి పంచాయితీ పెట్టి, సొంత అవసరాలకు వీవోఏ వినియోగించిన నగదును బ్యాంకులో జమ చేసేవిధంగా ఒప్పందం చేయనున్నట్లు సమాచారం. వీవోఏను, 13 సమభావన సంఘాల సభ్యులను మండల స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ శైలజ, సీసీ నర్సయ్యలు విచారణ చేశారు. సమభావన సంఘాల సభ్యులు చెల్లించిన రూ.13.99లక్షలను వీవోఏ బ్యాంకులో జమ చేయకుండా సొంత అవసరాలకు వినియోగించిందని తెలిపారు. మిగిలిన మరో 11 సంఘాలు నేడు పూర్తి స్థాయిలో విచారిస్తామని వారు తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం: ఏపీఎం సౌజన్య

చౌటపల్లి గ్రామంలో స్త్రీనిధి నిధులను వీవోఏ బ్యాంకులో చెల్లించకుండా సొంతానికి వాడుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్(ఏపీఎం) సౌజన్య తెలిపారు. స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్, సీసీల పర్యవేక్షణలో రుణాలు తీసుకున్న సంఘాల సభ్యులతో రెండు రోజుల నుంచి విచారణ జరుగుతోందన్నారు. పూర్తి స్థాయి విచారణ చేపట్టి నిధులు దుర్వినియోగం చేసిన వీవోఏపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి



వెంకన్న(ఫైల్)

నల్లగొండ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నల్లగొండ మండల పరిధిలో తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఎస్ఐ సైదాబాబు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం రాముల బండకు చెందిన గీత కార్మికుడు చామకూరి వెంకన్న(51) గురువారం ఉదయం తాటి చెట్టు ఎక్కుతూ జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకన్నకు భార్య, ముగ్గురు కుమార్తెలు కాగా వారికి వివాహాలు చేశాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అన్నారంలో..



రాజయ్య(ఫైల్)

తుంగతుర్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలోని అన్నారం గ్రామంలో తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన తండ రాజయ్య(43) రోజు మాదిరిగేనే తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కల్లుగీత కార్మికుడికి గాయాలు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పరిధిలో తాటిచెట్టు పైనుంచి జారి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. రేవణపల్లి విలీన గ్రామానికి చెందిన కప్పల జంగయ్యగౌడ్ గురువారం తాటిచెట్టు పైనుంచి జారిపడ్డాడు. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలు కాగా, హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు.

జూదరుల అరెస్టు

గుర్రంపోడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం కొప్పోలులో పేకాటఆడుతున్న ఇద్దరిని పట్టుకున్నట్లు ఎస్ఐ మధు గురువారం తెలిపారు. పట్టుకొని నుంచి రూ.3వేల నగదు స్వాధీనం చేసుకున్నామని, మరో ఇద్దరు పారిపోయారని ఎస్ఐ తెలిపారు.

కక్షతోనే ఉప్పలంచ మాజీ సర్పంచ్ హత్య

నల్లగొండ క్రైం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కక్షతోనే శాలిగౌరారం మండలం ఉప్పలంచ గ్రామ మాజీ సర్పంచ్ బండారు మల్లయ్యను ప్రత్యర్థులు హత్య చేయించినట్లు నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో గురువారం కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఈ హత్యలో మొత్తం 11 మంది నిందితులు ఉండగా ఏడుగురిని అరెస్టు చేశామని, మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. 2009, 2019 ఎన్నికల్లో ఉప్పలంచ గ్రామానికి చెందిన బండారు మల్లయ్య సర్పంచ్‌గా ఎన్నికై గ్రామంలో ఏ సమస్య వచ్చినా పరిష్కరించేవాడని డీఎస్పీ తెలిపారు. అయితే గ్రామంలో ఎస్సీ మాదిగ సామాజికవర్గ కులదేవత పాపమ్మకు కొంతభూమిని వారి పూర్వీకులు కేటాయించగా ఈ భూమిలో వారి పాలివాళ్లకి 12 మందికి భాగం ఉందని, ఈ గుడికి సంబంధించిన భూమిలో రుద్రారపు యాదగిరి, రుద్రారపు మల్లయ్య కొంతభూమిని ఆక్రమించి మరుగుదొడ్లు నిర్మించుకున్నట్లు తెలిపారు. రుద్రారపు యాదగిరి అలియాస్ చిన్నయాదగిరి, టైలర్ నర్సింహ గుంట భూమిని ఆక్రమించుకున్నట్లు తెలిపారు. దీంతో వారు మాజీ సర్పంచ్ బండారు మల్లయ్య వద్ద పంచాయితీ పెట్టారు. రుద్రారపు కుమార్ భూమిని ఆక్రమించిన వారికి మద్దతుగా మాట్లాడగా, ఆ భూమిని గ్రామస్థులు తిరిగి స్వాధీనం చేసుకుని చుట్టూ ఫెన్సింగ్ కట్టించారు. దీనికి మాజీ సర్పంచ్ మల్లయ్యనే కారణమని కక్ష పెంచుకుని, మల్లయ్యను హత్య చేయాలని కుట్ర పన్నినట్లు తెలిపారు. కిరాయి వ్యక్తులైన సూరారపు యాదగిరి, కొంపల్లి చంద్రమౌళి, కొంపల్లి శ్రీరాములు, సూరారం నర్సింహతో రూ.11 లక్షలకు సుపారీ కుదుర్చుకున్నారని వివరించారు. ఈ నెల మొదటి వారంలోనే మల్లయ్యను హత్య చేయాలని కుట్రపన్నినా అది విఫలమైందన్నారు. కాగా ఈ నెల 21వ తేదీన మల్లయ్య పొలం నుంచి ఇంటికి వస్తుండగా ముందుగా నిందితులు వేసుకున్న పథకం ప్రకారం కర్రలతో దాడి చేశారని డీఎస్పీ తెలిపారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన మల్లయ్యను గ్రామస్థులు ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ చనిపోయాడన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రుద్రారపు యాదగిరి, రుద్రారపు మల్లయ్య, సూరారపు యాదగిరి అలియాస్ గడ్డం యాదగిరి, కొంపల్లి చంద్రమౌళి, కొంపల్లి శ్రీరాములు, రుద్రారపు నర్సింహ అలియాస్ నర్సయ్య, రుద్రారపు కుమార్, తాడోజు శ్రీకాంతరాజులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి ఐదుకర్రలు, కారు, మూడు మోటార్ సైకిళ్లు, ఎనిమిది ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని, వీరిపై గతంలోనే పలు కేసులు ఉన్నట్లు వివరించారు. సమావేశంలో శాలిగౌరారం సీఐ కొమిరెడ్డి కొండల్‌రెడ్డి, ఎస్ఐ డీ సైదులు ఉన్నారు.



కేసుల వివరాలు విలేకరులకు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

బైక్‌ల దొంగ అరెస్టు

కొంతకాలంగా బైక్‌లు చోరీకి పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. నిందితుడి నుంచి రూ.5 లక్షల విలువైన రెండుస్కూటీలు, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలం కలకొండ గ్రామానికి చెందిన డొంకె నర్సింహ నల్లగొండ జిల్లా మునుగోడు మండలం వెల్మకన్నె గ్రామానికి చెందిన ఝాన్సీని 2019లో వివాహం చేసుకుని అత్తగారి ఇంటి వద్దనే భార్యతో కలిసి ఉంటున్నాడు. నర్సింహ గతంలో హయత్‌నగర్ పీఎస్ పరిధిలో గ్యాస్‌సిలిండర్ చోరీ చేసిన కేసులో జైలుకు వెళ్లి ప్రస్తుతం బెయిల్‌పై వచ్చాడు. వ్యసనాలకు అలవాటుపడి బైక్‌లను చోరీచేయాలని నిర్ణయించుకుని హయత్‌నగర్, వనస్థలిపురం, చౌటుప్పల్, మునుగోడు, నల్లగొండ వన్‌టౌన్, నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో బైక్‌లను చోరీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. చోరీ చేసిన వాహనాలను నల్లగొండలోని సాగర్ రోడ్డులో బైక్ మెకానిక్ షాపు నడిపే రమేష్‌కు విక్రయించి వచ్చిన డబ్బులతో వ్యసనాలకు వాడుకున్నాడని ఆయన తెలిపారు. బుధవారం సాయంత్రం నల్లగొండ బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా టూటౌన్ పోలీసులకు నర్సింహ చోరీచేసిన స్కూటీపై వెళ్తుండగా అనుమానాస్పదంగా ఉండడంతో పట్టుకుని విచారించినట్లు తెలిపారు. బైక్ చోరీలు చేసినట్లు నర్సింహ అంగీకరించగా అతడి వద్ద నుంచి చోరీ చేసిన వాహనాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో కేసును ఛేదించిన టూటౌన్ సీఐ రాఘవారావు, ఎస్ఐ రావుల నాగరాజు, సిబ్బంది బాలకోటి, శంకర్‌లను ఎస్పీ అభినందిచారు.

కుటుంబ తగాదాలతో పశ్చిమబెంగాల్ వాసి ఆత్మహత్య

సూర్యాపేట క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ తగాదాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం జరిగింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమబెంగాల్ రాష్ట్రం బంకురా జిల్లా మతం గ్రామానికి చెందిన సకెందు కర్మాకర్(35) రెండేళ్లుగా సూర్యాపేటలోని ఓ పీసీసీ కంపెనీలో కూలీగా పనిచేస్తూ కంపెనీ దగ్గరలోనే ఒక గదిని తీసుకొని ఉంటున్నాడు. ఐదు నెలల పాటు పనిచేసి స్వగ్రామానికి వెళ్లి నెల రోజుల కిందట తిరిగి వచ్చాడు. ఈ నెల 28న స్వగ్రామానికి వెళ్తున్నానని కంపెనీలో చెప్పి రిజిస్టర్‌లో నమోదు చేసి వెళ్లిపోయాడు. అయితే అక్కడికి వెళ్లకుండా శాంతినగర్‌లోని చెట్లపొదల్లో చెట్టుకు ఉరివేసుకున్నాడు. అటుగా వెళ్లిన స్థానికులు గురువారం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కర్మాకర్ మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ తగాదాల కారణంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన తపన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అబద్ధాలతో మోసగిస్తున్న సీఎం

● మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి ● దేవరకొండలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం



గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న జగదీ‌ష్‌రెడ్డి

దేవరకొండ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలను అమలుచేయడంలో విఫలమైందని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి విమర్శించారు. గురువారం నల్లగొండ జిల్లా దేవరకొండలో గాంధీ విగ్రహం ఎదుట పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్‌తో కలిసి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతోపాటు కాంగ్రెస్ నేతాలంతా అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాజుల అంజనేయులు, లోక్యానాయక్, టీవీఎన్ రెడ్డి, యేసోబు, రవికుమార్, దస్రునాయక్ పాల్గొన్నారు.

కంటైనర్‌ను ఢీకొట్టిన ప్రైవేటు బస్సు

మునగాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి):సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో మొద్దులచెరువు సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సు డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడకు చెందిన బస్సు డ్రైవర్ శ్రీనివాస్ క్యాబిన్‌లో చిక్కుకుని తీవ్రగాయాలయ్యాయి. అతడిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. బస్సులో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు.



ఆరోగ్యమే.. మహాభాగ్యం

ఆరుపదుల వయస్సు దాటినా ఎంతో ఆనందంగా ఉంటున్నారు. ఒక్కొక్కరు ఒక్కో ఆలోచన విధానంతో ముందుకు సాగుతున్నారు. ఒకరు సామాజిక సేవ, మరొకరు ఆధ్యాత్మిక చింతనను అందరికీ పంచుతూ, అందులో వారూ ఆనందం పొందుతున్నారు. ఈ వయస్సులో కూడా శ్రమైక జీవనం, వ్యాయామానికి తోడు నలుగురికి సాయం చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

సీనియర్ సిటిజన్ల అభిప్రాయం ఇలా..

అంశం	సీనియర్ సిటిజన్లు అభిప్రాయం
తీర్థయాత్రలు, పర్యాటకం	31 (13%)
ఆధ్యాత్మికత	53 (22%)
ఆరోగ్య సంరక్షణ	73 (30%)
సామాజికసేవ	41 (17%)
కుటుంబ బాధ్యతలు	42 (18%)
మొత్తం	240 (100%)



ఆరోగ్యం, ఆధ్యాత్మికానికే ప్రాధాన్యం

నేను ప్రధానోపాధ్యాయుడిగా రిటైర్ అయ్యాను. ప్రస్తుతం నా వయసు 72 ఏళ్లు. ఉదయాన్నేలేచి కాలకృత్యాలు తీర్చుకొని కొంతసేపు వాకింగ్ చేస్తాను.స్నానంచేసి దేవాలయానికి వెళ్లి పూజలు చేస్తా. ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటా. రిటైర్డ్ ఉద్యోగులమంతా రోజూ మాసంఘ భవనం వద్ద కలుసుకొని కొంతసేపు పిచ్చాపాటీ మాట్లాడుకుంటాం.

పంగునూరు లింగయ్య, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు, దేవరకొండ



రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం ఏర్పాటు చేశా

నేను పోలీస్ ఎస్ఐగా ఏడేళ్ల క్రితం రిటైర్ అయ్యా. ప్రతిరోజూ ఆరోగ్యం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటా. వాకింగ్, వ్యాయామం చేస్తా. ఆహార నియమాలు పాటిస్తా. కుటుంబ వ్యవహారాలన్నీ ఇప్పటికీ నేనే పర్యవేక్షిస్తా. ఏడాది క్రితం రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం స్థాపించా. రిటైర్డ్ పోలీసుల సంక్షేమం, వారి ఆరోగ్యసంరక్షణకు కార్యాచరణ రూపొందించి పనిచేస్తున్నాం.

కే.రంగారెడ్డి, రిటైర్డ్ ఎస్ఐ, సూర్యాపేట



ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటా

పోస్టల్‌శాఖలో పనిచేసి రిటైరయ్యా. శేషజీవితాన్ని భగవంతుడి సేవలో గడుపుతున్నా. తీర్థయాత్రలు, ఆలయాలకు వెళుతుంటాం. రోజూ దేవాలయానికి వెళ్లి గడుపుతా. స్వామిజీల ప్రవచనాలు వింటా. టీవీలలో వచ్చే భక్తి కార్యక్రమాలు, దేవాలయాల పూజలు, స్వామిజీల ప్రవచానాలు వింటా. ఆధ్మాత్మిక మార్గంలో ధర్మయుతంగా ఉంటున్నాం. ప్రశాంతంగా ఉండేలా చూసుకుంటా.

వరగాని పురుషోత్తం, రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి, నల్లగొండ



విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి పనిచేస్తున్నా

ఎన్నెస్పీలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ 2004లో ఉద్యోగ విరమణ చేశా. 21 ఏళ్లుగా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తున్నా. విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి నావంతు కృషి చేస్తున్నా. అంతేకాకుండా మా అందరి సంక్షేమం, ఆరోగ్య సంరక్షణకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. ప్రతీనెలా ఆరోగ్యశిబిరాలు, కంటిపరీక్షలు నిర్వహిస్తున్నాం. బ్యాంకులనుంచి రుణాలిప్పించడానికి, పింఛన్లు ఇప్పించడానికి ఆటంకాల్లేకుండా చూస్తున్నాం.

చెన్నా సోమయ్య, హుజూర్‌నగర్



సామాజికసేవకు ప్రాధాన్యం

ఉదయాన్నే వాకింగ్ చేస్తా. మా వ్యవసాయబావి వద్దకు వెళ్లి తేలికపాటి పనులు చేస్తుంటా. సామాజికసేవకు ప్రాధాన్యమిస్తున్నా. రిటైర్డ్ ఉద్యోగుల సంఘానికి అధ్యక్షుడిగా కూడా బాధ్యతల్లో ఉన్నా. సంఘం భవన నిర్మాణం చేపడుతున్నాం. సంఘ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకోసం క్రమం తప్పకుండా ఆరోగ్యశిబిరాలు నిర్వహిస్తున్నాం. మా స్వగ్రామం పాలడుగులో పాఠశాలలో స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందిస్తా. బొడ్రాయి పండుగ, రామాలయ వార్షికోత్సవాల వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో పాలుపంచుకుంటాను.

బద్దం యాదిరెడ్డి, రిటైర్డ్ ఎంఈవో, మోత్కూరు



పాటలు పాడుతూ.. వీడియోలు చేసి యూట్యూబ్‌లో అప్లోడ్ చేస్తున్నా

నేను ఆర్టీసీలో 2010లో రిటైర్ అయ్యాను. నాకు చిన్నప్పటి నుంచి పాటలుపాడడం హాబీ. ఇప్పుడు సమయం లభించడంతో రిటైర్ అయినప్పటి నుంచి పాటలు పాడుతూ వాటిని వీడియోలు తీసి యూట్యూబ్‌లో అప్లోడ్ చేస్తున్నా. ఇదో మంచి వ్యాపకంగా మారింది. 500కు పైగా పాతసినిమాల పాటలు పాడి అప్లోడ్ చేశా. నా ఛానల్‌కు 1,300 మంది సబ్‌స్క్రైబర్స్ ఉంటే, 1.70లక్షల వ్యూస్ వచ్చాయి. సంతోషంగా గడుపుతున్నాను.

లక్ష్మయ్య, రిటైర్డ్ ఆర్టీసీ సెక్యురిటీ ఇన్‌స్పెక్టర్, మిర్యాలగూడ



రోజూ వాకింగ్ చేస్తా

వృద్ధాప్యంలో ఆరోగ్యసమస్యలు ఎదురవుతాయి. ఆరోగ్యసంరక్షణకు ప్రాధాన్యమిస్తున్నాను. రోజూ ఉదయం మూడుకిలోమీటర్ల వరకు వాకింగ్ చేస్తాను. ఉదయం, సాయంత్రం సెంటర్‌కు వెళ్లి మా వయసువారితో కలిసి పిచ్చాపాటీ ముచ్చటిస్తాం. తీర్థయాత్రలకు పెద్దగా వెళ్లను. ఈవయసులో ఎక్కువ ప్రయాణాలు చేయడం కూడా ఇబ్బందే. మాతో పాటు కుటుంబీకులను ఇబ్బంది పెట్టడం సమంజసం కాదు. అందుకే ఇంటివద్దనే ఉంటున్నాను.

ఏపూరి గోపాల్, సంస్థాన్ నారాయణపురం

ఆంధ్రజ్యోతి సర్వే



సామాజిక చైతన్యం పెంచడమే విధి

సామాజిక చైతన్యం పెంచేందుకు నావంతు కృషి చేస్తున్నా. రిటైరయినా ఇంట్లో కూర్చోకుండా తోటి పెన్షనర్లతో కలిసి సంఘం ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాం. ఆరోగ్యశిబిరాలు చేపడుతున్నాం. సాహిత్య, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాం. సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిగా ఉన్నత విలువలను పెంచడానికి నావంతు కృషి చేస్తున్నా.

పందిరి శ్యాంసుందర్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, నల్లగొండ



సంతోషమే సగం బలం

సంతోషమే సగం జీవనం. దేవుడిచ్చిన జన్మని సార్థకం చేసుకోవాలి. బాధ్యతలను తగ్గించుకొని ఆత్మీయులను పెంచుకుంటున్నా. నా వయసు 70 ఏళ్లు. దేవాలయాలు, పుణ్యక్షేత్రాలన్నింటినీ సందర్శించా. వయోరీత్యా ఆరోగ్య సమస్యలున్నా, ఆనందంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నా. మితమైన ఆహారం తీసుకుంటున్నా.

గుండు శ్రీశైలం, వ్యాపారవేత్త, ఆలేరు



ఆధ్యాత్మికతే పరమావధి

40ఏళ్ల పాటు కిరాణావ్యాపారం నిర్వహించా. ప్రస్తుతం ఎలాంటి వ్యాపారకార్యకలాపాలు నిర్వహించడంలేదు. ఇంటివద్దనే ఉండి విశ్రాంతి తీసుకుంటున్నా. శేషజీవితం పూర్తిగా ఆధ్మాత్మిక కార్యక్రమాల్లో గడపదల్చుకున్నా. దేవాలయాలకువెళ్లడం, ప్రవచనాలు వినడం చేస్తుంటాను.

బండారు మురళి, నార్కట్‌పల్లి



ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాం

నేను రిటైరయ్యాక ఆధ్మాత్మికత కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొంటున్నాను. కుటుంబంతో కలిసి తరచూ దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు సందర్శిస్తుంటాం. గుడికి వెళ్లి పూజలు చేస్తాం. ప్రవచనాలు వింటాం. టీవీలోనూ ఉదయం వచ్చే భక్తి కార్యక్రమాలు వీక్షిస్తుంటాం. స్నేహితులతో కలిసి విందు, వినోదాలు చేసుకుంటూ సరదాగా గడుపుతున్నాం.

జమ్ముల మోహన్‌రెడ్డి, రిటైర్డ్ లైన్‌ఇన్‌స్పెక్టర్, కోదాడ.

వరి సాగు పెరిగింది

(5వపేజీ తరువాయి)



కూరగాయలు, ఆకుకూరలు సాగుకాగా, నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో వీటి విస్తీర్ణం నామమాత్రంగా నమోదైంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదల కొనసాగుతున్న క్రమంలో మెట్ట, కూరగాయాలు, ఉద్యాన పంటలసాగు తగ్గడానికి ప్రధానకారణమని అధికారులు చెబుతున్నారు.

సన్నాలకే మొగ్గు

ఉమ్మడి జిల్లాలో సాగైన విస్తీర్ణంలో అత్యధికంగా కావేరి చింట్లు, హెచ్ఎంటీ, 505, చిట్టిపొట్టి, 606 రకాలకు చెందిన సన్నరకం వంగడాలకు రైతులు ప్రాధాన్యం ఇచ్చారు. స్వల్పకాలిక వంగడాల సాగుతో సాగునీటి కష్టాల నుంచి ఊరట దక్కడమేగాక దిగుబడులు ఆశించిన మేరకు లభిస్తాయన్న ఆశాభావం రైతుల్లో ఉంది. దీంతో ప్రైవేట్ వరి విత్తనాలపై మక్కువ చూపుతున్నారు. వ్యాపారులు సైతం నాణ్యమైన సన్నధాన్యం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. బహిరంగ మార్కెట్లో డిమాండ్ ఉన్న సన్నాలను రైతులు ఎంచుకొని అధికంగా యాసంగి సీజన్‌లో సాగుచేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 72శాతం సన్నరకం వరిసాగైనట్టు అధికారులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించడం, ఆరబెట్టకుండా తేమశాతం ఉండగానే నేరుగా మిల్లుపాయింట్ల వద్ద కొనుగోళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో రైతులు వీటి సాగుకే మొగ్గుచూపుతున్నారు. గతంలో ఆయకట్టేతర ప్రాంతాలతోపాటు మూసీ ఆయకట్టు కింద ఐఆర్ 1010 దొడ్డురకం వరిసాగు అత్యధికంగా జరిగేది. కేవలం సాగర్ ఆయకట్టులో మాత్రమే సన్నాల సాగు ఉండగా, ప్రస్తుతం అన్ని ప్రాంతాల రైతులు సన్నరకం వరిని పండించేందుకు ఆసక్తి చూపుతుండటంతో దొడ్డురకం సాగు క్రమంగా తగ్గుతోంది. సాగర్, మూసీ ఆయకట్టు, చెరువులు, బోరుబావుల కింద యాసంగి వరిసాగు ఏకకాలంలో పూర్తయింది. గతంతో పోల్చుకుంటే ఈ సీజన్‌లో పక్షం రోజుల ముందుగానే వరినాట్లు పూర్తయ్యాయి. దీంతో పంట దిగుబడులు సైతం మార్చి నెలాఖరు నుంచే బహిరంగ మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ధాన్యం విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



దిగుబడుల అంచనాలు రూపొందిస్తాం

యాసంగి సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం గతం కంటే పెరిగింది. అదేస్థాయిలో దిగుబడులు పెరిగే అవకాశం ఉంది. వరికి ఆశించే తెగుళ్లను అరికట్టేందుకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతాంగానికి అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం సాగు విస్తీర్ణాన్ని బట్టి దిగుబడుల అంచనా నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం. ధాన్యం విక్రయల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకునేందుకు సమాయత్తం అవుతున్నాం. అవసరమైన ప్రాంతాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం.

శ్రవణ్‌కుమార్, నల్లగొండ డీఏవో



సన్న ధాన్యం ధరలో స్థిరత్వం ఉండాలి

బహిరంగ మార్కెట్లో సన్నబియ్యం ధరలకు అనుగుణంగా ధాన్యం ధరలో స్థిరత్వం ఉండాలి. రైతుల అవసరాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆదిలోనే వ్యాపారులు కుమ్మక్కై ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ప్రతీ సీజన్‌లో ఇదే తంతు జరుగుతున్నా ప్రభుత్వం అంతగా పట్టించుకోవడం లేదు. సన్నబియ్యం ధరలు పెంచి మిల్లర్లు లాభాలు గడిస్తుంటే రేయింబవళ్లు కష్టపడ్డ రైతులకు కనీసం దినసరి కూలి గిట్టుబాటు కావడంలేదు. సన్నధాన్యం ధర క్వింటాకు కనీసం రూ.2800 వరకు లభిస్తేనే గిట్టుబాటవుతుంది.

జడ మల్లేష్‌యాదవ్, రైతు, వేములపల్లి



సాగువ్యయం బాగా పెరిగింది

వరిసాగు వ్యయం ఏటా పెరుగుతోంది. పెట్టుబడులకు అనుగుణంగా రాబడి ఉండడం లేదు. ట్రాక్టర్ కిరాయిలతో పాటు కూలీలు, ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగాయి. ఏటా సాగు వ్యవయం పెరుగుతున్నా, ఆ మేరకు మద్దతు ధర లభించడం లేదు. ప్రధానంగా సన్న ధాన్యం పండించిన రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. గత ఏడాది యాసంగి సీజన్‌లో ఎకరాకు రూ.28వేల సాగువ్యయం ఉంటే ప్రస్తుతం రూ.37వేలకుపైబడి ఖర్చువస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులకు సహాయం చేయాలి.

నారాయణ శేఖర్‌రెడ్డి, రైతు, వేములపల్లి

తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి

- కలెక్టరేట్ ఎదుట అరగుండుతో దివ్యాంగుడి నిరసన

సూర్యాపేట(కలెక్టరేట్), జనవరి 30, (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులకు సమాచారం లేకుండా మరణించిన భర్త పేరిట ఉన్న వ్యవసాయ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. బాధితురాలు మట్టపల్లి పూలమ్మతో కలిసి కలెక్టరేట్ ఎదుట గురువారం అర గుండుతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ చివ్వెంల మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన మట్టపల్లి పూలమ్మ భర్త వెంకటాచలం పేరిట మోతె మండలం నామవరం రెవెన్యూ శివారులో ఏడు ఎకరాల 10 గుంటల వ్యవసాయ భూమి ఉందన్నారు. అయితే వెంకటాచలం నాలుగేళ్ల క్రితం మరణించాడని ఆయనకు సంబంధించి తల్లి లింగమ్మ, దివ్యాంగురాలైన భార్య పూలమ్మ, కుమారుడు రఘుతో పాటు మొదటి భార్యకు చెందిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారన్నారు. అయితే వెంకటాచలం మరణించిన తర్వాత కుటుంబ సభ్యులు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ పొందారని అందులో మొదటి భార్య, ఇద్దరు కుమార్తెలతో పాటు భార్య, తల్లి, కుమారుడు ఉన్నారన్నారు. అంతేకాకుండా వ్యవసాయ భూమి ఒరిజనల్ పాస్ పుస్తకాలను సూర్యాపేటలోని ఓ బ్యాంకులో తనఖా పెట్టి రుణం పొందారన్నారు. ఇవన్నీ పరిగణలోకి తీసుకోకుండా మొదటి భార్యకు సంబంధించిన ఇద్దరు కుమార్తెల పేరిట వ్యవసాయ భూమిని మోతె మండల తహసీల్దార్ సంఘమిత్ర అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిందని తెలిపారు. ఈవిషయమై ఆర్డీవోకు ఫిర్యాదు చేయగా ఈనెల 27న విచారణ జరిపి తహసీల్దార్ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని తమకు తెలిపారన్నారు.. అయినప్పటికి తహసీల్దార్‌పై నేటికీ చర్యలు తీసుకోలేదని, భూమిని కూడా పూలమ్మ కుటుంబ సభ్యుల పేరిట రిజిస్ట్రేషన్ చేయలేదన్నారు. దివ్యాంగురాలైన పూలమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జరిగిన విషయంపై సమగ్ర విచారణ చేయించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గోగుల శేఖర్‌రెడ్డి, ఎండీ షరీఫ్, బాలకృష్ణ, వీరమ్మ, జానమ్మ, నగేష్, హుస్సేన్ బీ, పద్మ, వెంకన్న, సంతోష్, రాంకుమార్, సోమయ్య, సైదులుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో అర గుండుతో నిరసన తెలుపుతున్న రాజేష్



సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు

గుట్టలో 23న మహాకుంభ సంప్రోక్షణ

- స్వర్ణగోపురం ప్రారంభానికి హాజరుకానున్న సీఎం
- నదీజలాల సేకరణ క్రతువు ప్రారంభం



సంప్రోక్షణకు నదీజలాల సేకరణకు జెండా ఊపి ప్రారంభిస్తున్న దేవాదాయ శాఖ కమిషనర్ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్య క్షేత్రంలో ఫిబ్రవరి 23న స్వర్ణ దివ్య విమాన రాజగోపురం ప్రారంభోత్సవానికి సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరై మహాకుంభ సంప్రోక్షణలో పాల్గొననున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో గురువారం యాదగిరిగుట్ట కొండపై ఉన్న క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు, ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావుతో కలిసి దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.శ్రీధర్ సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 19నుంచి ఆలయంలో సంప్రోక్షణ శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఉత్సవాలకు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు వస్తున్నందున ఏర్పాట్లపై సూచనలు, సలహాలు చేశారు. దేశంలో అన్ని నదుల నుంచి ఆలయ అర్చకులు, వేదపండితులు పుణ్య జలాలు సేకరించి మహాకుంభ సంప్రోక్షణ నిర్వహించేందుకు సంకల్పించినట్లు వివరించారు. అందులో భాగంగా నదీజలాల సేకరణకు కార్యక్రమానికి కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ హనుమంతరావు, ఈవో భాస్కర్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. సమీక్షలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, అదనపు డిప్యూటీ కమిషనర్ లక్ష్మీకాంతారావు, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, ఏసీపీలు సైదులు, రమేష్, ఆలయ ప్రధానార్చకుడు నల్లందీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, అగ్నిమాపక, ఇంజనీరింగ్ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఒకే గ్రామం నుంచి ఐదుగురు క్రీడాకారులు

- అందరూ కబడ్డీ జాతీయ క్రీడాకారులే
- సూర్యాపేట జిల్లా వెంపటి గ్రామవాసులు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వారందరూ నిరుపేద కుటుంబాలకు చెందిన గ్రామీణ క్రీడాకారులే.. కబడ్డీలో ప్రతిభను చాటాలన్న వారి ఆసక్తికి ఆర్థిక ఇక్కట్లు అడ్డు రాలేదు... అంది వచ్చిన ప్రభుత్వ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. కుటుంబ సభ్యుల అండ, కోచ్ శిక్షణతో జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో విజయప్రస్థానాన్ని కొనసాగించారు. యాదాద్రి జోన్ సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన ఐదుగురు క్రీడాకారులు. ఫలితంగా ప్రస్తుతం వీరందరూ పోలీస్ సంస్థల్లో ఉద్యోగులుగా చేరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కరీంనగర్ కమిషనరేట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో ఒకేప్రాంతానికి చెందిన వీరు కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభచాటుతున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో యాదాద్రి జోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న వీరు తమ జట్టు విజయంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.



వెంపటి గ్రామానికి చెందిన క్రీడాకారులు



రాణించాలనే తపనతో

కబడ్డీలో చిన్ననాటి నుంచి రాణించాలని తపనతో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగా. పలు జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించాను. ఫలితంగా స్పోర్ట్స్ కోటాలో ఎస్ఐగా ఉద్యోగం వచ్చింది. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాను.

- గుండగాని శ్రావణి, ఎస్ఐ, హైదరాబాద్ సిటీ



జాతీయస్థాయిలో రాణిస్తున్నా

ఎలాంటి క్రీడా నేపథ్యంలేని కుటుంబం మాది. తోటి క్రీడాకారులు కబడ్డీ ఆడుతుండడం చూసి కబడ్డీలో ఓనమాలు నేర్చుకున్నాను. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. పోలీస్ ఉద్యోగం సంపాదించాను. యాదాద్రి జోన్ కబడ్డీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాను. పోలీస్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు కృషి చేస్తా.

- కె సుధీర్, హెడ్ కానిస్టేబుల్



జట్టు విజయంలో కీలకపాత్ర

పలు రాష్ట్ర, జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నాను. రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది. సూర్యాపేట నుంచి జాతీయ క్రీడాకారులుగా ఎదిగాం. రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో మా జట్టు విజయంలో కీలకపాత్ర పోషిస్తున్నాం.

- కొమురెల్లి, కానిస్టేబుల్, హైదరాబాద్



రాష్ట్ర స్థాయి పోలీసులు క్రీడలు నిర్వహించడం అభినందనీయం

కరీంనగర్ జిల్లా కేంద్రంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మూడవ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలు నిర్వహించడం అభినందనీయం. చాలా సంవత్సరాల తర్వాత పోలీస్ క్రీడలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర పోటీల్లో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యేందుకు కృషి చేస్తాం.

- ఆకుల నవీన్, పోలీస్ హెడ్ కానిస్టేబుల్, సూర్యాపేట

త్రివేణి సంగమం జలాల పంపిణీ

హుజూర్‌నగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన గూడెపు నాగలింగం వారం రోజుల క్రితం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు వెళ్లి గురువారం స్వగ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా గంగా, యమున, సరస్వతి నదుల పవిత్ర జలాన్ని తీసుకురాగా గురువారం గ్రామంలోని ప్రజలకు ఆ పవిత్ర జలాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగలింగం మాట్లాడుతూ 144 సంవత్సరాలకు ఒకసారి వచ్చేటటువంటి ఈ కుంభమేళాలో పాల్గొనడం ఎన్నో జన్మల పుణ్యమని అన్నారు.



త్రివేణి సంగమం జలాలను పంపిణీ చేస్తున్న నాగలింగం

పశుసంపదను పెంచడానికి హెల్త్ క్యాంపులు దోహదం

మేళ్లచెర్వు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పశుసంపదను పెంచడానికి ఉచిత పశువైద్య శిబిరాలు దోహద పడతాయని సూర్యాపేట జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు అన్నారు. సీఎస్ఆర్ నిధులతో మైహోం సంస్థ, పశుసంవర్ధక శాఖ, సంయుక్తంగా గురువారం మండలంలోని వేపలమాదారం గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 100ఆవులు, 100గేదెలు, 3500 మేకలు, గొర్రెలు ఇతర పెంపుడు జంతువులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామకార్యదర్శి గుర్వారెడ్డి, మైహోం సంస్థ జీఎం నాగేశ్వరరావు, మైన్స్ జీఎం శ్రీనివాసరావు, ఏజీఎం శ్రీనివాస్, వెంకటరత్నం, మాజీ సర్పంచ్‌లు సునీత, బాలరాజు, మోహన్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.



సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం వేపలమాధారంలో పశుపోషకులకు మందులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

నల్లగొండ
నకిరేకల్ - మునుగోడు

తెలంగాణ గుర్తింపునకు కృషి చేసిన కేసీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న మందడి సైదిరెడ్డి

నల్లగొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రత్యేక రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో ఒక ప్రత్యేక స్థానం రావడానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్ కృషి కారణమని, ఆ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు మరిచిపోవద్దని మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతలు విమర్శలు చేయడం విచారకరమన్నారు. నల్లగొండలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన జీవోలకు సంబంధించిన పనులేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బ్యాంకులు కూడా నమ్మడం లేదన్నారు. సమావేశంలో నాయకులు అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, కొండూరు సత్యనారాయణ, వంగాల సహదేవరెడ్డి, మారగోని గణేష్, అయితగోని యాదయ్య, దేప వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ పరీక్ష గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐవో

నార్కట్‌పల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కెమిస్ట్రీ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్ష లు నిర్వహించే ల్యాబ్ గదుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి దస్రూనాయక్ అన్నారు. నార్కట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని గురువారం ఆయన సందర్శించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణ పరీక్షలు రాస్తున్న కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు ఏజెన్సీ ద్వారా సీసీ కెమెరాలను అమర్చుతున్నట్లు తెలిపారు. ప్రైవేట్ కాలేజీలు మాత్రం సొంతంగానే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కళాశాలలోని పలు సమస్యలను ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ డీఐవో దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయన కోరారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

మర్రిగూడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య అన్నారు. మండలంలోని శివన్నగూడెంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసిన నాలుగు సంక్షేమ పథకాలైన రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. కొంతమంది సంక్షేమ పథకాలపై చెడు ప్రచారం చేస్తున్నారని, అపోహలకు గురుకావద్దని ఆయన కోరారు. మండలంలోని కొట్టాల గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా ఎంపిక చేయడం హర్షనీయమని అన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరాందాసు శ్రీనివాస్, నాయకులు లింగారెడ్డి, సిరిపంగ శ్రీనివాస్, బంగారం, వెంకటేష్, వెంకన్న, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి



దీక్షకు సంఘీభావం తెలియజేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

మునుగోడు రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల హామీలను అమలుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో డీవైఎఫ్ఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన నిరవధిక నిరాహార దీక్షలకు ఆయన పాల్గొని మాట్లాడారు. 20 సంవత్సరాల నుంచి గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడం చాలా విడ్డూరమన్నారు. గ్రామ అభివృద్ధి కోసం యువజన, ప్రజా సంఘాలకు చేస్తున్న ఈ పోరాటాన్ని అభినందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను పకడ్బందీగా అమలు చేయాలని, అర్హులైన పేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లను ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా నిధులు రైతు పంటసాయంగా వేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఇప్పటి వరకు ఖాతాలో డబ్బులు జమకాకపోవడం సిగ్గుచేటు అన్నారు. కల్వకుంట్ల నుండి వెల్మకన్నె వరకు బీటీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం పథకాల పేరుతోటి కాలయాపన చేయడం సరైనది కాదని అన్నారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బండ శ్రీశైలం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యేకు ఓట్ల మీద, పదవుల మీద ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యల మీద లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు సాగర్ల మల్లేష్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు మిరియాల భరత్, సీఐటీయూ మండల కన్వీనర్ కుప్పల ముత్యాలు, ప్రజా సంఘాల నాయకులు కట్ట లింగస్వామి, నారగోని నరసింహ, బొందు పెద్ద అంజయ్య, పగిళ్ల మధు, సుందరయ్య, అంజయ్య, గౌరయ్య, బొందు నాగమ్మ, ఆంజనేయులు, మహేష్, సాయి తేజ, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకపర్చిన మహిళపై కేసు

గుర్రంపోడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకపరిచిన కేసులో బుర్రి పద్మ అనే మహిళను రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ జిల్లా గుర్రంపోడు ఎస్ఐ పసుపులేటి మధు తెలిపారు. మండలంలోని లక్ష్మీదేవిగూడెం గ్రామశివారులో విద్యుత్ ఉద్యోగులు 400 కేవీ లైన్ వేస్తుండగా బుర్రి పద్మ విద్యుత్ లైన్‌వేస్తే పురుగుల మందు తాగుతా అని బెదిరించింది. ఈ ఘటనపై ఏడీ వీరస్వామి ఫిర్యాదు మేరకు ఎస్ఐ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లారు. అయితే పోలీసులను కూడా పద్మ బెదిరించి, పురుగుల మందు తాగడానికి ప్రయత్నించింది. ఆపడానికి వెళ్లిన హోంగార్డు సుజాత చేతిని బలంగా కొరికి గాయపర్చింది. ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తూ బెదిరించి, గాయపర్చినందుకు పద్మను అదుపులోకి తీసుకొని రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

గంజాయి కేసులో ఆరు నెలల జైలు

కట్టంగూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడి గంజాయి, బంగారం తరలిస్తూ పట్టుబడ్డ అంతర్రాష్ట్ర నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ గురువారం నకిరేకల్ కోర్టు తీర్పు వెలువరించింది. నల్లగొండ జిల్లా కట్టంగూరు ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా జంగారెడ్డి మండలం, జంగారెడ్డి గ్రామానికి చెందిన పోలవరపు నాగదుర్గప్రసాద్ మరో ముగ్గురితో కలిసి 29 ఆగస్టు 2024న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నందిగామ పట్టణంలో రెండు ఇళ్లల్లో చోరీ చేశారు. ఆ బంగారాన్ని నిందితులు హైదరాబాద్‌లో విక్రయించేందుకు రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్తుండగా కట్టంగూరు శివారులో ఎస్ఐ శ్రీను పట్టుకునేందుకు ప్రయత్నించాడు. అందులో పోలవరపు నాగదుర్గాప్రసాద్ పట్టుబడ్డారు. నిందితుడిని విచారించగా రూ.7500 విలువ గల 300 గ్రాముల గంజాయి, 14.73 తులాల బంగారు ఆభరణాలు రూ.30వేల నగదు, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్‌తో కలిపి మొత్తం రూ.12లక్షలు విలువ చేసే వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి కేసును విచారించి దర్యాప్తు చేసిన పత్రాలను నకిరేకల్ కోర్టుకు అందజేయగా, కేసు రుజువు కావడంతో జడ్జి షేక్ ఆరీఫ్ నిందితుడికి ఆరు నెలలు జైలుశిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం



నల్లగొండలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ, మునుగోడు, చిట్యాలరూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను నెరవేర్చకుండా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వలేదని, రుణమాఫీ చేయలేదని, బోనస్ కూడా చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కటికం సత్తయ్యగౌడ్, చీర పంకజ్‌యాదవ్, బొర్ర సుధాకర్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, కొండూరు సత్యనారాయణ, బోనగిరి దేవేందర్, దేప వెంకట్‌రెడ్డి, మారగోని గణేష్, రావుల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సమక్షంలో మాడ్గులపల్లికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలి

మునుగోడు: కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, తెలంగాణ కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ అన్నారు. మునుగోడులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం గాంధీ విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 420 అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 420 రోజులైన వాటిని అమలుచేయటం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి మందుల సత్యంకురుమ, నాయకులు పూల వెంకటేశం, సతీష్, పోలగోని సైదులుగౌడ్, ఈద శరత్‌బాబు, సురేష్‌కుమార్, విజయ్‌గౌడ్, జాల నాగరాజుయాదవ్, జిల్లా సుఖేందర్, శ్రీనివాస్, జెలేందర్, బోయపాటి సురేందర్, సైదులు, శ్రీను పాల్గొన్నారు.

● చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులోని గాంధీ గుడిలో గాంధీ విగ్రహానికి జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నూదిరెడ్డి నరేందర్‌రెడ్డి వినూత్నంగా వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ రైతుబంధును పెట్టి రైతాంగానికి పెట్టుబడినందించారని ప్రస్తుతం రైతులకు దిక్కులేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుభరోసా అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను విస్మరించారన్నారని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ 420హామీలను నెరవేర్చాని మహాత్మాగాంధీ సీఎం రేవంత్‌రెడ్డికి సద్బుద్ధిని కలిగించి ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చేలా చేయాలని కోరారు. కార్యక్రమంలో చెర్వుగట్టు మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ, నార్కట్‌పల్లి మాజీ ఎంపిటిసి పుల్లెంల ముత్తయ్య, పంజాల రామలింగం, ఎండి. జాని పాల్గొన్నారు.

గోపలాయపల్లిలో పౌరహక్కుల దినోత్సవం

నార్కట్‌పల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపలాయపల్లిలో పౌరహక్కుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. దళిత కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో కే.ఉమేష్ చారి, ఆర్ఐ తరుణ్, పంచాయతీ కార్యదర్శి గ్రా మస్థులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

శాలిగౌరారం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు తోట వినోద్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను నట్టేటా ముంచిందని ఆరోపించారు. లబ్ధిదారులకు పథకాలు అమలు చేసే విషయంతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఎవరికి వారే ప్రకటనలు చేసి ప్రజలను తికమక పెడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే పథకాలను తక్షణమే అమలు చేయాలన్నారు.

గాంధీజీ ఆశయసాధన కోసం కృషి చేయాలి



మంత్రి క్యాంపు కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మోహన్‌రెడ్డి, నాయకులు

నల్లగొండ టౌన్, మునుగోడు, నార్కట్‌పల్లి, నకిరేకల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలని, ఆయన చూపిన మార్గంలో పయనించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం గాంధీజీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, తిప్పర్తి మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని అన్నెపర్తిలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి, ఓఎస్డీ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, ఆచార్య ఆకుల రవి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సురేష్‌రెడ్డి, డాక్టర్ అరుణప్రియ, డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడులోని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు సైదులు, మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న, జిట్టగోని యాదరి, ఆరేళ్ల సైదులుముదిరాజ్, చలిచీమల యాదగిరి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని వాసవీ భవన్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్వాయి భాస్కర్‌రావు, ఇడుకుళ్ల బిక్షమయ్య, దోసపాటి ప్రసాద్, పసునూరి శ్రీనివాస్, దోసపాటి విష్ణుమూర్తి, కోటయ్య, వేణు, రఘు, కర్నాటి శ్రీనివాస్, బండారు శ్రీనివాస్, అమరవాది రాములు, బిళ్లకంటి శ్రీకాంత్, సరాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.

● నకిరేకల్‌లో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని వివిధ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించారు. వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్, బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ నలగాటి ప్రసన్నరాజ్, మునిపిపల్ చైర్ పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

అందుబాటులో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు



మర్రిగూడలో బీఎస్ఎన్ఎల్ ఓటీఎల్ బోర్డును అమర్చిన బీఎస్ఎన్ఎల్ అధికారులు

మర్రిగూడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు 4జీ సేవలు అందుబాటులోకి వస్తాయని బీఎస్ఎన్ఎల్ ఎస్డీ వెంకటరమణ తెలిపారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందుబాటులో ఉండటానికి అప్టికల్ టెర్మినల్ నెట్‌వర్క్(ఓటీఎల్) బోర్డు సిస్టమ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీని వల్ల వినియోగదారులే కాకుండా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ కార్యాలయాల్లో 4జీ సేవలు హైస్పీడ్ ద్వారా డేటా ఎంట్రీ, ఆన్‌లైన్ ఎంట్రీ సులువుగా చేసుకోవచ్చని అన్నారు. త్వరలోనే 4జీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. త్వరలో నాంపల్లి, మాల్, చండూర్‌లో 4జీ సేవలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈయన వెంట మోహన్ నాయక్, వెంకటయ్య పలువురు ఉన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ



రాజుపేట చౌరస్తాలో మన గ్రోమోర్ దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏవో హేమలత

మర్రిగూడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్ ఎరువుల దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో హేమలత అన్నారు. మర్రిగూడ, వట్టిపల్లి, రాజుపేట చౌరస్తాలోఎరువుల దుకాణాలను గురువారం ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎవరైనా డీలర్లు యూరియాతో పాటు ఇతర గుళికలు తీసుకుంటేనే యూరియా అమ్ముతామని షరతులు పెట్టవద్దని ఎరువుల దుకాణాలకు వచ్చిన రైతులకు ఏ ఎరువు అడిగిన ఇవ్వాలంటూ ఆమె తెలిపారు. ఆమె వెంట ఏఈవో విజయ్ ఉన్నారు.

వేతనాలు చెల్లించాలని కార్మికుల సమ్మె



కార్మికులతో మాట్లాడుతున్న సయ్యద్ ముసాబ్ అహ్మద్

రామగిరి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా రావాల్సిన వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ పట్టణాధ్యక్షుడు ఎండీ సలీం ఆధ్వర్యంలో గురువారం స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ రెండు నెలలుగా కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలు ఇవ్వకుండా మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. క్రిస్మస్, సంక్రాంతి పండుగలు ఉన్నప్పటికీ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. 9నెలల ఏరియర్స్ బిల్లులు ఇవ్వడంలో అధికారులు, కాంట్రాక్టర్లు ఒకరిమీద ఒకరు చెప్పుకుంటూ కార్మికులను ఇబ్బంది పెడుతున్నారన్నారు.

కమిషనర్ హామీతో తాత్కాలిక విరమణ

కార్మికుల వద్దకు మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ హాజరై 4 రోజుల్లో 2 నెలల వేతనాలు బ్యాంకులో వేతనాలు పడేలా చర్యలు తీసకుంటామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు సమ్మెను తాత్కాలికంగా విర మిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో సోమవారం నాటికి వేతనాలు రాకపోతే మంగళవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పట్టణ నాయకులు కోట్ల అశోక్‌రెడ్డి, నాయకులు గండమల్ల శ్రీనివాస్, పెరిక కళ్యాణ్, పెరిక కృష్ణ, జిడిమెట్ల నర్సింహ, కత్తుల కృష్ణవేణి, పందుల లింగయ్య, ఎర్ర శ్రీను, పాండు తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి,(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి కోరారు. మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో సంపూర్ణ సురక్ష పథకం కింద గురువారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు 132 రకాల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారుల అరుంధతిరెడ్డి, సుధాకర్, రమేష్, లింగస్వామి, రత్నప్రభ తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం, (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో దివ్యాంగులకు రుణాల కోసం దరఖాస్తు తేదీని పొడగించాలని దివ్యాంగుల సంఘం మండలాధ్యక్షుడు చలకాని శ్రీశైలం ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 2 ప్రభుత్వం చివరి తేదీగా ప్రకటించిందని రెవిన్యూ అధికారులు గ్రామ సభలకు వెళ్లడం, సర్వర్లు సక్రమంగా పనిచేయక పోవడం వల్ల కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడానికి దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం మరో 15రోజులు దరఖాస్తు తేదీని పొడగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవీపీఎస్ మండల అధ్యక్షులు దాసరి దేవచిత్తం, సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య ఉన్నారు.

● గట్టుప్పల్ (ఆంధ్రజ్యోతి): వెల్మకన్నె గ్రామంలో మౌలిక వసతులు కల్పనకు మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎంపీడీవో మాధవరెడ్డిని గురువారం గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు.. అన్ని శాఖల అధికారులు తమ గ్రామాభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కలిసిన వారిలో యాదగిరి రెడ్డి, టేకుమట్ల శ్రీరాములు, రాజు, ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడురూరల్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలు కోసం మండలంలోని గుండ్లోరిగూడెం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు గ్రా మంగా ఎంపిక చేసినందుకు గ్రామస్తులు గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్వీట్లు తినిపించి, శాలువాతో సన్మానించి, ధన్యవాదాలు తెలిపారు. కలిసిన వారిలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు జంగిలి నాగరాజు, ఈర్ల సత్తయ్యమహేష్, నవీన్, సింహాద్రి ఉన్నారు.

● శాలిగౌరారం, (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మడలం తుడిమిడి గ్రామానికి చెందిన ప్రముఖ డాక్టర్ పవన్‌సాయి మల్టిస్పెషాలిటీ అధినేత డాక్టర్ ఆలేటి శ్రీనివాస్‌గౌడ్‌ను పలువురు బీసీ సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో శాలిగౌరారం సింగిల్ విండో సీఈవో నిమ్మల అంజనేయులు, మాదారం మాజీ సర్పంచ్ జెర్రిపోతుల చంద్రమౌళి గౌడ్, వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.

● తిప్పర్తి, (ఆంధ్రజ్యోతి): మండలం అనిశెట్టి దుప్పలపల్లి గ్రామ మాజీ సర్పంచ్ వంటెపాక సుశీల భర్త పరశురాములు(39) అనా రోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ తండు సైదులుగౌడ్ మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో వారి వెంట బీఆర్ఎస్ తిప్పర్తి మండల అధ్యక్షుడు పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో ఎత్తిన ఎర్రజెండా దించని నిజమైన కమ్యూనిష్టు నాయకుడు కల్లూరి యాదగిరి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం ఎల్లారెడ్డిగూడెంలో జరిగిన నార్కట్‌పల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి సంస్మరణ సభకు ఆయన హాజరై మాట్లాడారు. తొలుత కల్లూరి యాదగిరి చిత్రపటానికి పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డిలతో కలిసి పూలమాల వేసి లాల్ సలాం అర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, గ్రామ మాజీ ఉపసర్పంచ్ వడ్డే భూపాల్‌రెడ్డి, నారి అయిలయ్య, అచ్చాలు, చెర్కు పెద్దులు, అనంతరెడ్డి, శంకర్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

గట్టుప్పల్ మండలాన్ని అభివృద్ధి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం

గట్టుప్పల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కొత్త మండలం గట్టుప్పల్‌కు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక నిధులు తీసుకవచ్చి మండలాన్ని అభివృద్ధి చేయాలని మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో చేసిన పనులకు బిల్లులు రాకుండా అడ్డు కోవడం దురదృష్టకరమన్నారు. గత పనులకు మంజూరైన పనులకు నిధు లు కేటాయించకుండా ఇప్పటి వరకు పనులు ప్రారంభించకపోవడం దారుణమన్నారు. ఈ మండలం అభివృద్ధిలో వెనకబడి ఉందని మండలాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఒకవేళ మండలాభివృద్ధిపై నిర్లక్ష్యం వహిస్తే తమ పార్టీ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అవ్వారి శ్రీనివాస్, చెరుపల్లి భాస్కర్, బండారి చంద్రయ్య, పున్న కిషోర్, చెరుపల్లి నగేష్, చిలుకూరి అంజయ్య, నీలాంటి వెంకటేశం, మాదవని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చందుపట్లలో ఉచిత కంటి వైద్యశిబిరం

నకిరేకల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందుపట్ల గ్రామంలో గురువారం విజయ కంటి దవాఖానా ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి సమస్యలు ఉన్న వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇమ్మడపాక వెంకన్న, పుట్ట సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కొమ్ము వెంకటేశం, నర్సింగ్ వెంకటేష్, దిగ్గోజు వెంకటాచారి, గుంటకంపు రమేష్, పర్వతం లింగయ్య పాల్గొన్నారు.

వచ్చే నెల 8న ప్రవేశ పరీక్ష


పెద్దవూర, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతుల్లో పలు కారణాలతో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయడానికి అడ్మిషన్లు చేసుకున్న విద్యార్థులకు వచ్చే నెల 8వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అడ్మిట్‌కార్డు డౌన్‌లోడ్ సందర్భంలో ఏమైనా సమస్యలు ఏర్పడితే 9652845807 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆలయం వద్ద హక్కుల కోసం వేలం

దామరచర్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడపల్లిలో కొలువైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వద్ద కొబ్బరికాయలు, పూజా సామగ్రి, లడ్డు, పులిహోరా, వాహనాల పార్కింగ్ రుసుములను వసూలు చేసుకునే హక్కు నిర్వహణకు వచ్చే నెల 17న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో బి.జ్యోతి తెలిపారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శుక్రవారం 31 జనవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980


నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.131	210	240
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 । కనిష్ఠం 18.8



ఆరోగ్యమే మహాభాగ్యం

- ఆధ్యాత్మికతకూ ప్రాధాన్యం
- మలిదశలో సీనియర్ సిటిజన్ల అభిప్రాయం
- వయసుడిగినా తప్పని కుటుంబ బాధ్యతల్లో కొందరు
- సామాజిక సేవతో కొందరికి సంతృప్తి

'ఆంధ్రజ్యోతి' సర్వేలో వెల్లడైన భిన్నాభిప్రాయాలు



జీవితమంతా ఏదో ఒక వృత్తిలో కొనసాగిన వారు ఆ బాధ్యతల నుంచి విరమణ పొందాక ఏదో వ్యాపకాన్ని కల్పించుకొని సంతృప్తి చెందుతున్నారు. ఓ వైపు ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటూ, మరోవైపు వారికిష్టమైన వ్యాపకంతో గడుపుతున్నారు. కొందరికి అనివార్యంగా ఇంకా కుటుంబ బాధ్యతలు నిర్వర్తించాల్సి రావడంతో కొందరు వృద్ధాప్యంలోనూ ఏదో ఒక వృత్తి నిర్వరిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. మరికొందరు విశ్రాంతి తీసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఇంకొందరు తీర్థ యాత్రలు, పర్యాటక ప్రాంతాలు సందర్శిస్తున్నారు. కొందరు సామాజిక సేవతో సంతృప్తి చెందుతున్నారు. సీనియర్ సిటిజన్లు వృత్తి విరమణ తర్వాత ఏం చేస్తున్నారనే అంశంపై 'ఆంధ్రజ్యోతి' సర్వే నిర్వహించగా, అత్యధికంగా ఆరోగ్యసంరక్షణ, ఆధ్యాత్మికానికి ప్రాధాన్యమివ్వగా, అత్యల్పంగా తీర్థయాత్రలకు వెళ్తామని అభిప్రాయం వ్యక్తం చేశారు.

● వివరాలు 7లో.. - (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

ఆరోగ్య సంరక్షణకు 30శాతం మంది ప్రాధాన్యం

ఉమ్మడి జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లోని సీనియర్ సిటిజన్ల వ్యాపకాలపై 'ఆంధ్రజ్యోతి' సర్వే నిర్వహించింది. మొత్తం 19 మునిసిపాలిటీల్లో 240 మందిని 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. పర్యాట కం, ఆధ్యాత్మికం, ఆరోగ్యం, సామాజికసేవ, ఉద్యోగం, కుటుంబ బాధ్యతలు అనే ఐదు అంశాల్లో వేటికి ప్రాధాన్యం ఇస్తారని ప్రశ్నించగా, వారు మనోగతాన్ని ఆవిష్కరించారు. ఈ సర్వేలో 73 మంది అంటే 30శాతం మంది ఆరోగ్యసంరక్షణకు ప్రాధాన్యమిచ్చారు. ఆతర్వాత 22 శాతం (53మంది) శేషజీవితాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వెచ్చిస్తున్నామని, భగవంతుడి సేవలో తరిస్తున్నామని పేర్కొన్నారు. మరో 18 శాతం (42మంది) అనివార్య పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో చిరుద్యోగాలు, కుటుంబ బాధ్యతలు నిర్వర్తించక తప్పడం లేదని తెలిపా రు. 17శాతం (41 మంది) మాత్రం సామాజిక, సంఘ సేవలు నిర్వహిస్తున్నారు. 13శాతం (31మంది) తీర్థయాత్రలు, పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తూ కాలక్షేపం చేస్తున్నామని తెలిపారు.

గాంధీ అందరికీ ఆదర్శప్రాయుడు

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

చిట్యాలరూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అహింసామార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన గాంధీజీ అందరికీ ఆదర్శప్రాయుడని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పెద్దకాపర్తి శివారులోని గాంధీ గుడిలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అహింసామార్గం భవిష్యత్ తరాలకు అందించాలంటే మళ్లీ గాంధీ పుట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం స్వార్థం కారణంగా వ్యవస్థలు, రాజకీయాలు భ్రష్టుపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిలర్‌గా పోటీ చేయాలన్నా లక్షలు వెచ్చించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించే వారికే పార్టీలు టికెట్‌లు ఇస్తే రాజకీయాలు కాస్తయినా మారుతాయన్నారు. జాతీయరహదారి వెంట గాంధీ గుడిని నిర్మించి భక్తులు దర్శించుకునే అవకాశాన్ని కల్పించిన ఆలయ ట్రస్టీ మోర శ్రీపాల్‌రెడ్డి, మోర భూపాల్‌రెడ్డి, పారుపల్లి వెంకటకృష్ణారావు, డాక్టర్ సీత అభినందనీయులన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ చీఫ్ ఇన్‌కంటాక్స్ అధికారులు పీవీ.రావు, వెంకటేశ్వర్లు, జగదీష్‌బాబు, శివార్చక విజయ్‌కుమార్, నాగసూరి వేణుగోపాల్, ఎస్‌కె.బాబూజీ, గోపాలగాంధీ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలి : కలెక్టర్




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండటౌన్,జనవరి 30 (ఆంధ్రజ్యోతి):ప్రాజెక్టులు,స్థానిక పనులకు ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వంగమర్తి రీచ్‌లో ఇసుక తవ్వకాన్ని మరో ఆరు నెలలు పొడగిస్తున్నామన్నారు. ఇక్కడి నుంచి 3,66,613 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వేందుకు జిల్లా స్థాయి కమిటీ ఆమోదించిందన్నారు. అదేవిధంగా ఇక్కడి నుంచి సాగునీటి ప్రాజెక్టులైన ఉదయ సముద్రం, ఎస్ఎల్‌బీసీ,మునిసిపల్ పనులు, వైటీపీఎస్, కిష్టాపురం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులకు ఉపయోగించాలని తీర్మానించామన్నారు. మూసీ ఎగువన కొత్తగా గుర్తించిన ప్రాంతంలో 70,980క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకానికి కమిటీ అనుమతిస్తూ మూడు నెలల్లో మైనింగ్ అనుమతులకు ప్రణాళిక సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, శామ్యూల్ జాకబ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయం

ఎస్పీ శరత్‌చంద్ర పవార్




రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా నెల రోజుల పాటు రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. గురువారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ డాక్టర్ ఎన్.వాణితో కలిసి స్థానిక ఎన్జీ కళాశాలలో ప్రారంభించారు. ఎస్పీ స్వయంగా బైక్ నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని స్టేషన్ల పరిధిలో ప్రజలకు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. తనతో పాటు ప్రతీ డీఎస్పీ ఓ గ్రామాన్ని దత్తత తీసుకుని రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నామన్నారు. అంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, ట్రాఫిక్ సీఐ రాజు, వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ లావణ్య, ఎంవీఐలు కొండయ్య, మల్లికార్జున్, స్వప్న, సోనిప్రియ, ఏఎంవీఐలు భాస్కర్‌రెడ్డి, గోపినాథ్, పాల్గొన్నారు.

వరి సాగు పెరిగింది





కాలం కలిసొచ్చి ప్రాజెక్టుల్లో రెండు పంటలకు సరిపడా సాగునీరు నిల్వ ఉంది. నీటి వనరులు సమృద్ధిగా లభించడంతో రైతులు యాసంగి పంటల సాగు పనులు శరవేగంగా పూర్తిచేశారు. యాసంగిలో వరి విస్తీర్ణం సాధారణ స్థాయికి మించింది. నీటి లభ్యత పెరిగిన నేపథ్యంలో ఉద్యాన పంటల సాగును రైతులు వదిలేస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో మెట్టపంటల సాగు కనీసం సాధారణానికి మించడం లేదు. మరోవైపు సాగునీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాల రైతులు వరి సాగుకు ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో ఏటా దీని విస్తీర్ణం పెరుగుతోంది. 2023-24 యాసంగిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,43,472 ఎకరాల్లో వరి సాగు కాగా, ప్రస్తుత యాసంగిలో 11,87,864 ఎకరాల్లో సాగైంది. గత సీజన్ కంటే 1,44,392 ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగింది. దీంతో నాగార్జునసాగర్, మూసీ ఆయకట్టు పచ్చని పైర్లతో ఆకుపచ్చరంగును అద్దుకొని ఆహ్లాదాన్ని పంచుతూ కోనసీమను తలపిస్తోంది.

- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ అర్బన్)

- కలిసొచ్చిన కాలం
- ప్రాజెక్టుల నీటికి తోడు ఉపకరించిన బోరుబావులు
- యాసంగిలో 11.87 లక్షల ఎకరాల్లో సాగు
- బోనస్ ప్రకటనతో సన్నాల సాగుకే రైతుల మొగ్గు

ప్రాజెక్టులు జల కళను సంతరించుకోవడం, సమృద్ధిగా కురిసిన వర్షాలతో భూగర్భజలాలు పెరగడంతో సాగునీటి కష్టాల నుంచి ఊరట దక్కింది. ఈ నేపథ్యంలో అన్నదాతలు గడిచిన వానాకాలం, ప్రస్తుత యాసంగిలో సమయానుకూలంగా సాగు పనులు పూర్తిచేశారు. నాగార్జునసాగర్, మూసీ ప్రాజెక్టుల నుంచి సాగునీటి విడుదల కొనసాగుతున్న క్రమంలో వరిసాగుకు రైతులు ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో ఉమ్మడి జిల్లాలో వరిసాగు సాధారణ విస్తీర్ణం కంటే 15శాతం పెరిగింది. ఉమ్మడి జిల్లాలో వరి సాధారణ విస్తీర్ణం 10,31,313 ఎకరాలుగా కాగా, ఈ సీజన్‌లో 1,56,551 అధికంగా సాగైంది. సాగునీటి వనరులన్నీ వినియోగంలో రావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జొన్న, శనగ, పొద్దుతిరుగుడు, కంది, ఉలువ, మినుప వంటి మెట్ట విస్తీర్ణం పడిపోగా, ఉద్యాన పంటలసాగులోనూ లోటు ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలో 11,251 హెక్టార్లలో యాసంగి మెట్టపంటలు సాగు కావాల్సి ఉండగా, ప్రస్తుతం 6,047 హెక్టార్లలో మాత్రమే మెట్టపంటలు సాగయ్యాయి. బత్తాయి, నిమ్మ, మామిడి, సపోట తదితర ఉద్యాన పంటల సాగు ఏటా గణనీయంగా తగ్గుతోంది. గతంలో 93,252 ఎకరాల్లో ఉద్యాన పంటలసాగు జరిగితే ప్రస్తుతం సాగు విస్తీర్ణం 54,431 ఎకరాలకు పరిమితమైందని వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి. రానున్న రోజుల్లో మెట్ట, ఉద్యాన పంటలసాగు మరింతగా తగ్గే ప్రమాదం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు కురగాయల సాగుకు రైతులు ఏ మాత్రం ఆసక్తి చూపడంలేదు. యాదాద్రి జిల్లాలో ఈ సీజన్‌లో 850 ఎకరాల్లో

- మిగతా 7వ పేజీలో

పెద్దగట్టు జాతరకు నిధులు కేటాయించండి

సీఎంకు ఎంపీ రఘువీర్ వినతి



సీఎం రేవంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రఘువీర్

హాలియా, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిర్వహించే పెద్దగట్టు (గొల్లగట్టు) జాతరకు భారీగా నిధులు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో సీఎంను కలిసి వినతి పత్రం అందజేశారు. జాతరకు దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో భక్తులు వస్తారని, ఈ నేపథ్యంలో మౌలిక వసతులు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. గత ప్రభుత్వాల హయాంలో తాత్కాలిక ఏర్పాట్లు చేసి చే తులు దులుపుకున్నారని, ఈసారి శాశ్వత ప్రాతిపదిన పనులు చేయాలని కోరారు. దీంతో సీఎం స్పందించి నిధులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించినట్టు ఎంపీ తెలిపారు. కాగా, సీఎం సానుకూలంగా స్పందించడంపై కాంగ్రెస్ యూత్ మాజీ అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్ హర్షం వ్యక్తం చేశారు.

రైల్వేస్టేషన్లలో నగదు రహిత టికెట్ సేవలు

డీసీఎం కమలాకర్‌బాబు



నగదు రహిత టికెటింగ్‌పై ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న రైల్వే డీసీఎం కమలాకర్‌బాబు

మిర్యాలగూడ, మిర్యాలగూడ అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేస్టేషన్లలో నగదురహిత టికెట్ సేవలు అందుబాటులోకి తెచ్చినట్టు గుంటూరు డివిజన్ కర్షియల్ మేనేజర్ కమలాకర్‌బాబు తెలిపారు. గురువారం మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు నగదురహిత టికెట్ బుకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యూటీఎస్ మొబైల్ అప్లికేషన్ ద్వారా టికెట్లు బుక్‌చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా ప్రయాణికులు క్యూలైన్‌లో నిలబడకుండానే క్యూఆర్ కోడ్ ద్వారా టికెట్లు పొందే అవకాశం కల్పించామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని ఆన్‌లైన్ సేవలను దక్షిణమధ్య రైల్వేశాఖ అందుబాటులోకి తెస్తోందన్నారు. అనంతరం మొబైల్ టికెటింగ్ విధానంపై ప్రయాణికుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో నల్లగొండ సెక్షన్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సతీష్, మిర్యాలగూడ కమర్షియల్ సూపర్వైజర్ గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ రావడమే తరువాయి

పంచాయతీ ఎన్నికలకు అధికారుల ఏర్పాట్లు ముమ్మరం

ఇప్పటికే తుది ఓటర్ల జాబితా విడుదల •6లో..

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి

చింతపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని మండల వైద్యాధికారి శ్రీదేవి తెలిపారు. అంతర్జాతీయ కుష్ఠు వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని చింతపల్లి మండలంలోని జడ్పీహెచ్ఎ‌స్‌లో గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధి సోకిన వ్యక్తులతో దూరంగా ఉండాలన్నారు. వ్యాధి గుర్తించటానికి పరీక్షలు చేయించుకొని మందులు వాడటం వల్ల నివారించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కొండమల్లేపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులోని రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు గురువారం రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోడల్ ట్రాఫిక్ పార్క్‌ను ఏర్పాటు చేసి రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ గుర్తులు, ప్రమాదాలు ఎదుర్కోవడం, అతివేగంగా వాహనాలు వచ్చే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు పాఠశాల కరెస్పాండెంట్ ఎం.ఆనందరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫర్హీన్ సుల్తానా, బాలయ్య, యశ్వంత్, నాగమణి, విజయలక్ష్మి, సంధ్య, ధనమ్మ, శైలజ, మాధవి, సువర్ణ పాల్గొన్నారు.

శాంతి, అహింసలే మన మార్గం కావాలి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌తో కలిసి గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, దేవరకొండ, చింతపల్లి, హాలియా, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్ముడు బోధించిన శాంతి, అహింసలే మన మార్గం కావాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గాంధీ వర్థంతి సందర్భంగా గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌తో కలిసి మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యాగ్రహం అనే ఆయుధంతో బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్రోద్యమాన్ని నడిపించారని అన్నారు. ప్రజలందరూ గాంధీ చూపిన మార్గంలో నడవాలని కోరారు. ఆయన స్ఫూర్తితో దేశభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. భావితరాలకు గాంధీ ఆశయాలను బోధించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, మైబూబ్ అలీ, స్కైలాబ్ నాయక్, నూకల వేణుగోపాల్‌రెడ్డి, పొదిల శ్రీనివాస్, తలకొప్పుల సైదులు, జాని, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండలో నివాళులర్పిస్తున్న మునిసిపల్ కమిషనర్ సుదర్శన్

● దేవరకొండ మునిసిపల్ కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిపిత మహాత్మగాంధీ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. గాంధీబజార్‌లోని గాంధీ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కంభాలపల్లి వెంకటయ్య, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ, పలువురు నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, కాంగ్రెస్ నాయకులు అంకూరి సుగుణయ్య, విజయ్‌కుమార్, ఎర్ర అంజనేయులు, మైసయ్య, అంకూరి శివ పాల్గొన్నారు.

● చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, వూరె లక్ష్మణ్, నాయకులు బాదేపల్లి నిరంజన్‌గౌడ్, జిట్ట జగదీష్ పాల్గొన్నారు.

● హాలియాలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు వీరమళ్ల కృష్ణయ్య, మునిసిపాలిటీ అధ్యక్షుడు మంచుకొండ ప్రభాకర్, ఉపాధ్యక్షుడు చీదళ్ల లింగయ్య, బచ్చు సతీష్, సాయిబాబా ఆలయ చైర్మన్ తేలపోలు శేఖర్, చిట్టిపోలు శ్రీనివాస్, కొండూరు వెంకటేశ్వర్లు, పాంపాటి శ్రీనివాస్, గణేష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, శోభన్‌బాబు, మహేష్, లక్ష్మీకాంతం, దామోదర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండలంలోని నాయడుపాలెం గ్రామంలో టీపీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మందా సైదులురావుగౌతమ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ శివకోటి వీర్రాజు, దుండిగల జయమ్మ, అక్కిన త్రిమూర్తులు, మెగావత్ పాండునాయక్, మెండే సాయి, కంచనపల్లి రవీంద్ర, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

దేవరకొండ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు

డాక్టర్. రవిప్రకాష్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్



దేవరకొండ ప్రాంతీయ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని, దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి త్వరలో వంద పడకల నుంచి 200 పడకల ఆసుపత్రిగా ఏర్పాటవుతుందని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రవిప్రకాష్ అన్నారు.

(దేవరకొండ, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి వైద్యసేవలు అందిస్తున్నారు?

డాక్టర్: ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రోజు 700 నుంచి 800వరకు రోగులకు వైద్యాన్ని అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: విధులకు సకాలంలో హాజరుకాని డాక్టర్లు, సిబ్బందిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

డాక్టర్: ఆసుపత్రిలో పనిచేసే డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలి. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం. ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: ఆసుపత్రిలో రోగులకు సరిపడా మందులు పంపిణీ చేస్తున్నారా?

డాక్టర్: దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్ని రకాల మందులు, ఇంజక్షన్లు ఇస్తున్నాం. మందుల కొరతలేదు.

ఆంధ్రజ్యోతి: డయాలసిస్ పేషంట్‌లకు వైద్యం అందిస్తున్నారా?

డాక్టర్: ప్రతీరోజు 20మంది డయాలసిస్ పేషెంట్లకు వైద్యం అందిస్తున్నాం. మరికొన్ని డయాలసిస్ మిషన్లు మంజూరు కానున్నాయి.

ఆంధ్రజ్యోతి: 200 పడకల ఆసుపత్రి ఎప్పుడు ఏర్పాటు చేస్తారు?

డాక్టర్: ఇటీవల ఎమ్మెల్యే కలెక్టర్ ఇలా త్రిపాఠి, వైద్య విధానపరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, బాలునాయక్, దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. 200 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు త్వరలో కానుంది. 200 పడకల ఆసుపత్రి ఏర్పాటయితే ఆసుపత్రిలోనే అన్ని రకాల రోగాలకు వైద్యసేవలు అందనున్నాయి.

కొలువుదీరిన కొత్తమండల సిబ్బంది

● బాధ్యతలు స్వీకరించిన అధికారులు



ఎంపీడీవో కార్యాలయంలో వద్ద అధికారులు

పెద్దఅడిశర్లపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా ఆవిర్భవించిన గుడిపల్లి మండలంలో గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో అధికారులు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటికే గత ప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయగా అది ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. మండల అభివృద్ధి కార్యాలయాల గుర్తింపు, ఉద్యోగులు, సిబ్బంది సర్దుబాటు ప్రక్రియ పూర్తయింది. తాజాగా కార్యాలయంలో అవసరమైన సౌకర్యాలు కల్పించారు. పాత ప్రభుత్వ దవాఖానాను ఎంపీడీవో కార్యాలయంగా మార్చి ఆ భవనానికి రంగులు అద్దుతుండటంతో పాటు మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఫర్నీచర్ సైతం మండలానికి కేటాయించారు. వాస్తవానికి శుక్రవారం ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రారంభిస్తారని అధికారులు భావించారు. కానీ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో గురువారమే సిబ్బంది విధుల్లో చేరారు. ఎంపీడీవోగా గుర్రంపోడు ఎంపీవో ఎస్.పద్మ బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా ఒక జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, అటెండర్ విధుల్లో జాయిన్ అయ్యారు. నూతనంగా ఏర్పడిన మండలంలో ఐదు ఎంపీటీసీలు ఏర్పడనున్నాయి. 1. చిలకమర్రి, రోళ్లకల్లు, 2. గు డిపల్లి, సింగరాజుపల్లి 3, కేశంనేనిపల్లి, పోల్కంపల్లి, 4. భీమనపల్లి, మాదాపురం, ఘనిపల్లి 5. ఘనపురం, కోదండపురం, ఘట్‌నెమలిపురం. గతంలో పీఏపల్లి మండలంలో చిలకమర్రి, అంగడిపేట ఎక్స్‌రోడ్డు కలిపి ఎంపీటీసీ స్థానం ఉండగా అది ఇప్పుడు రోళ్లకల్లు, చిలకమర్రి కలిసి నూతన గుడిపల్లి మండలంలో ఎంపీటీసీ స్థానం చేశారు. దీంతో నూతన గుడిపల్లి మండలంలో పాలన ప్రారంభమైంది. మండల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో డిజిటలైజ్ చేస్తాం



ఐలాపురంలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ హరిబాబు

మిర్యాలగూడ రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పైలెట్ ప్రాజెక్టుగా కొన్ని గ్రామాలను తీసుకొని పట్టాదారులకు డిజిటలైజ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం మండలంలోని ఐలాపురం, ఊట్లపల్లి గ్రామాలను తహసీల్దార్ హరిబాబు సందర్శించి మాట్లాడారు. మిర్యాలగూడ మండలంలోని కొన్ని గ్రామాల్లోని కుటుంబాల్లో సమన్వయం లేక వివిధ కారణాలతో పట్టాదారులు తమ భూములను, వ్యవసాయ, నివాస భూములను, పట్టా బదిలీ కాకుండా ఉన్నాయని తెలిపారు. ఆ భూములు డిజిటలైజేషన్ జరగలేదన్నారు. మండలంలోని ఐలాపురం గ్రామపంచాయతీలో 78, ఊట్లపల్లి గ్రామపంచాయతీలో 68 సాదాబైనామాల పట్టాదారులు డిజిటలైజేషన్ చేసుకోలేదని పేర్కొన్నారు. రైతులను సమన్వయపరిచి డిజిటలైజేషన్ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ సత్యనారాయణ ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కొండమల్లేపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని మాజీ ఎంపీపీ రేఖశ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం కొండమల్లేపల్లి ప్రీమియర్ లీగ్ సీజన్ ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమలోని నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పస్నూరి యుగేందర్‌రెడ్డి, నాయకులు గంధం సురేష్, గుమ్మడవెల్లి జనార్దన్, అభిషేక్‌నాయక్, రాజశేఖర్‌రెడ్డి, జితేందర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

కొండమల్లేపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని ఎంఈవో నాగేశ్వర్‌రావు అన్నారు. కొండమల్లేపల్లి జడ్పీ హైస్కూల్‌లో గురువారం 2015-16 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. మాజీ ఎంపీపీ రేఖ శ్రీధర్‌రెడ్డి సొంత నిధులతో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. జరిగబోయే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమా ల్లో ఉపాధ్యాయులు మల్లెల జనార్దన్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాసులు, జాన్‌నాయక్, సరస్వతి, నాగార్జున, బాలాజీ, శ్రీనివాసచారి, శ్రీధర్, నీరజ, సైదానాయక్, వెంకట్, ఆంజనేయులు, శోభరాణి, అశోక్‌రెడ్డి, సామ్యనాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమన్‌రెడ్డి, వెంకటయ్య, జితేందర్, సువర్ణ, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం

● ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



మిర్యాలగూడలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, రైతుబంధు జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి

మిర్యాలగూడ, హాలియా, నాగార్జునసాగర్, తిరుమలగిరి(సాగర్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 420 రోజులు గడుస్తున్నా ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను ప్రభుత్వం మోసం చేసిందని ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మే రకు గురువారం పలు చోట్ల మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రాలు అందజేశారు. మిర్యాలగూడలో నాయకులు, కార్యకర్తలతో ఆ పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడు తూ మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను వంచించిందని అన్నారు. పోలీసులను అడ్డం పెట్టకొని మంత్రులు నిరంకుశ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా మాజీ అధ్యక్షుడు చింతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ధనావత్ చిట్టిబాబునాయక్, బైరం సంపత్, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, జొన్నలగడ్డ రంగారెడ్డి, మోసిన్ అలీ, యూసూఫ్, ఇలియాస్ ఖాన్, మల్లయ్య, షోయబ్, బారెడ్డి అశోక్‌రెడ్డి, భీమ్లానాయక్, వెంకన్న, విష్ణు, వేణు, సైదానాయక్ పాల్గొన్నారు.

● హాలియాలోని గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తప్పుడు హామీలతో ప్రజలు నమ్మించి గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి సర్కార్‌కు అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. రాబోయే రోజుల్లో ప్ర జలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు వడ్డే సతీష్‌రెడ్డి, నాయకులు జవ్వాజి వెంకటేశ్వర్లు, నల్లగొండ సుధాకర్, బందిలి పెద సైదులు, దోరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, రాంబాబు, ఎల్లయ్య, సైదాచారి, ఆంజనేయులు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్‌లోని పైలాన్ కాలనీలో గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ కౌన్సిలర్ రమేష్‌జీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రమౌళినాయక్, శేఖరాచారి, సైదులు, చంద్రయ్య, నజీరు బాబ, వీరయ్య, లక్ష్మణ్‌నాయక్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిడిగం నాగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కార్యక్రమంలో నాయకులు నాసర్‌రె డ్డి, పగడాల పెద్దిరాజు, మేకపోతుల కార్తీక్, కొత్తపల్లి శ్రీను, నాగెండ్ల వెంకట్‌రెడ్డి, వనమాలు, బాను రాథోడ్, వీరబోయిన మల్లిఖార్జున్, దుబ్బ కోటి, కోటిరెడ్డి, గోపి, సైదిరెడ్డి, అబ్బయ్య, జనార్ధన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కని నర్సింహులు



హాలియాలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నర్సింహులు

చింతపల్లి, హాలియా, నిడమనూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కని నర్సింహులు డిమాండ్ చేశారు. జిల్లాలోని పలు మండలాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీని మరింత బలోపేతం చేయడానికి కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఫిబ్రవరి మొదటి వారంలో కమిటీలను ఏర్పాట చేయనున్నట్లు తెలిపారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో సభ్యత్వ నమోదును పెద్ద ఎత్తున చేపట్టినట్లు చెప్పారు. లక్ష లోపు సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే 50వేల సభ్యత్వాలు పూర్తయినట్లు పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అన్నీ స్థానాలకు పోటీ చేసేందుకు కార్యాచరణ తయారు చేశామన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. చింతపల్లి మండలం వెంకటేశ్వరనగర్(మాల్)లో నిర్వహించిన సమావేశంలో కార్యక్రమంలో వుప్పల రమేష్, పుట్టబత్తుల విజయ్‌కుమార్(డాక్టర్), శ్రీధర్, సిద్ధగోని నరసింహ, రెడ్డగోని పెద్దయ్య, దోటి సంతోష్, సాలయ్య, బాలయ్య, అబ్బయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

● హాలియాలో నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్పా అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్లు ఉడుతూరి నర్సింహారెడ్డి, మందా తిరుపతయ్య, సబ్బు బలరాంరెడ్డి, కొట్టే శ్రీను, జమీల్, సైదులు, బిక్షం, వెంకన్న, రామస్వామి, రవి, ఉపేందర్, సక్రునాయక్, హరినాయక్, దాసరి శ్రీను, అనంతయ్య, సతీష్, రూబెన్ పాల్గొన్నారు.

● నిడమనూరు మాజీ ఎంపీపీ యడవెల్లి రంగశాయిరెడ్డి అకాల మృతి బాధాకరమని బక్కని నర్సింహులు అన్నారు. మండలంలోని తుమ్మడం గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి పలువురు నాయకులతో కలిసి రంగశాయిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయనతో తనకు మొదటి నుంచి మంచి అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, నాయకులు మందా తిరుపతయ్య, విక్రమ్‌రెడ్డి, యడవెల్లి వల్లభ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఉపేందర్, ముద్దా అనిల్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



ఆమనగల్లులో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న పీడీ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ పుష్పలత

వేములపల్లి, అడవిదేవులపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో సోలార్ పవర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలో బుగ్గబావిగూడెం, శెట్టిపాలెం, లక్ష్మీదేవిగూడెం సబ్‌స్టేషన్ల పరిధిలో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం డీఆర్‌డీఏ పీడీ రెవెన్యూ అధికారులతో కలిసి గురువారం స్థల ప రిశీలన చేశారు. పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం సుమా రు నాలుగు ఎకరాల భూమి అవసరం ఉందన్నారు. దీ నిలో భాగంగా బుగ్గబావిగూడెం, శెట్టిపాలెం, ఆమనగ ల్లు గ్రామాల్లో ప్రభుత్వ భూములను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఒక్కొక్క ప్లాంట్ నిర్మాణానికి సుమారు రూ.3కోట్ల మేర ఖర్చు అవుతుందని, వీటి నిర్వహణను ఆయా గ్రామాల పరిధిలోని గ్రామ సంఘాలకు అప్పగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఈ నిధులను ఆయా సంఘబంధం పదిశాతం సమకూర్చగా మిగిలిన నిధులను బ్యాంకు లోన్ల ద్వారా సమకూర్చనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, సర్వేయర్ రాము, ఏపీవో మిరాజుద్దీన్, సీసీ గోపి తదితరులు పాల్గొన్నారు.

● అడవిదేవులపల్లి మండలంలోని ముల్కచర్ల గ్రామంలో నాలుగు ఎకరాల భూమిని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి పరిశీలించారు. గ్రామంలో స్థలాన్ని పరిశీలించామని, నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట తెలంగాణ రెడ్‌కో జిల్లా మేనేజర్ పాండురంగారావు, ఎంపీడీవో మోసిన్‌బిన్‌అహ్మద్, ఆర్ఐ శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఎత్తివేయాలి

తిరుమలగిరి(సాగర్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు 20 రోజులు పూర్తి చేసిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామన్న ప్రభుత్వ నిబంధనలను ఎత్తివేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు వేములకొండ పుల్లయ్య కోరారు. మండలంలోని రాజవరం గ్రామంలో గురువారం నిర్వహించిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూమిలేని వ్యవసాయ కార్మికులందరికీ రూ.12వేలు ఇచ్చే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అర్హులైన వారందరికీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జటావత్ రవి, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు నల్లబెల్లి జగదీష్, నాయకులు చాంద్‌పాషా, బుర్రి సైదయ్య, శివ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

మాడ్గులపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని పార్టీ మండల నాయకుడు గొట్టిముక్కుల నాగాచారి అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. ప్రతిపక్షాలు ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తున్నాయని అన్నారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

‘స్త్రీనిధి’ రుణాలను వసూలు చేయాలి



సాగర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న అనంతకిషోర్

నాగార్జునసాగర్, హాలియా, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఆధ్వర్యంలో ఇచ్చిన స్త్రీ నిధి రుణాలను ఫిబ్రవరి 10వ తేదీలోపు వంద శాతం వసూలు చేయాలని మెప్మా జోనల్ మేనేజర్ అనంతకిషోర్ అన్నారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో నందికొండ మునిసిపల్ కార్యాలయంలో గురువారం ఆర్‌పీలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నందికొండలో రుణాల వసూళ్లు మరి తక్కువ గా ఉన్నాయన్నారు. రుణాల వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆర్‌పీలను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీను, ఆర్ఎం శ్రీలేఖ, మెప్మా డీసీఎం శివాజీ, టీఎంసీ బక్కయ్య, మహేష్, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

● హాలియా మునిసిపాలిటీ కార్యాలయంలో ఏఎల్ఎఫ్ ఆర్‌పీలతో నిర్వహించిన సమావేశంలో మునిసిపాలిటీ కమిషనర్ రామదుర్గారెడ్డి మాట్లాడారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకు 100శాతం స్త్రీ నిధి రికవరీ జరగాలని అన్నారు. ప్రస్తుతం హాలియా మునిసిపాలిటీలో 60 శాతంగా స్త్రీనిధి రికవరీ పర్సంటేజీ ఉందని అన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి జోనల్ మేనేజర్ అనంత కిషోర్, రీజనల్ మేనేజర్ శ్రీలేఖ, మెప్మా డీఎంసీ శివాజీ, టీఎంసీ పద్మ, అసిస్టెంట్ మేనేజర్ మహేష్, ఆర్పీలు పాల్గొన్నారు.

ఆలయం వద్ద

హక్కుల కోసం వేలం

దామరచర్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడపల్లిలో కొలువైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వద్ద కొబ్బరికాయలు, పూజా సామగ్రి, లడ్డు, పులిహోరా, వాహనాల పార్కింగ్ రుసుములను వసూలు చేసుకునే హక్కు నిర్వహణకు వచ్చే నెల 17న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో బి.జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది కాలపరిమితిలో అమ్ముకోవడానికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హక్కులు పొందేందుకు వేలంలో పాల్గొనేవారు రూ.10వేల డిపాజిట్ చెల్లించాలని కోరారు. ఇతర వివరాలకు దేవస్థాన కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

తహసీల్దార్‌కు సన్మానం

దామరచర్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇటీవల ఉత్తమ అవార్డులు అందుకున్న తహసీల్దార్ జవహర్‌లాల్, మండల వైద్యాధికారి డాక్టర్ నాగేశ్వర్‌రావును సేవాలాల్ సేనా ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేనా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధీరావత్ మోహన్‌నాయక్ మాట్లాడుతూ గిరిజన అధికారులు మున్ముందు ప్రజలకు మెరుగైన సేవలు అందించి మరిన్ని అవార్డులు పొందాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ధనావత్ ప్రకాశ్‌నాయక్, నాయకులు మున్నా, సైదా, వీర, శారద తదితరులు పాల్గొన్నారు.

ఉపవాస దీక్షలతో తిరుమలకు

● వేంకటేశ్వరస్వామి దర్శనానికి పాదయాత్ర

కొండమల్లేపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బుడ్డోనితండావాసులు ఉపవాస దీక్షలతో తిరుమలకు బయల్దేరారు. మండల పరిధిలోని బుడ్డోనితండావాసులు ప్రతి ఏడాది మాఘమాసం ఆరంభం లో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనార్థం ఉపవాస దీక్షలు నిర్వహిస్తూ వెళ్తుంటారు. వాల్య బావోజీ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. ఈ సారి కూడా తండాకు చెందిన సుమారు 50 మంది ఉపవాస దీక్షలతో స్వామివారి దర్శనానికి గురువారం తిరుపతికి బయల్దేరి వెళ్లారు. బయల్దేరి వెళ్లిన వారిలో ముడావత్ పాండు, ముడావత్ వెంకటేష్, చందులాల్, శంకర్, మల్లేష్, కృష్ణ, రమేష్‌బాబు పాల్గొన్నారు.